# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక


శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

గూడూరి వెంకట రత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ఎస్ రామతారక పరబ్రహ్మ శాస్త్రి

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ వి.వి. ఆర్ ప్రసాదరావు

డా॥ యమ్ స్వర్ణముఖి



**సంపుటి 33 సంచిక 12**

**పేజీలు 40**

**ఆగస్ట్ 2013**

**5సం॥ల చందా రూ. 250**

**2సం॥ల చందా రూ. 120**

**సంవత్సర చందా రూ. 60**

**విడిప్రతి వెల...... రూ. 5**

బ్యాంక్ డ్రాఫ్టు A/C Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ పేరుతో డ్రా చేయండి.

M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


***ఈ సంచికలో*** ............................. ....... **పేజీ**


| | |
|---|---|
| భద్రవాక్యం | 2 |
| యోగి వేమన | 3 |
| శ్రీబాబూజీ ఉవాచ | 4 |
| శ్రీమాతాజీ అభిభాషణ | 6 |
| సన్నిధిలో సంభాషణ | 8 |
| శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు | 10 |
| యోగవాశిష్ఠము | 11 |
| గురు కృపాహి కేవలమ్ | 13 |
| లోకనాధంగారి ఏకాదశి | 14 |
| పరిప్రశ్నేన సేవయా | 16 |
| శ్రీకృష్ణ కర్ణామృతం | 17 |
| ధ్యానం ఎందుకు చేయాలి? | 19 |
| సర్వము నీ దయ | 21 |
| ఈశ్వర లీల | 23 |
| చందాదారులకు విజ్ఞప్తి | 24 |
| బోధలబాబా మహిమ | 25 |
| బాలకృష్ణుని లీలలు | 27 |
| సర్వత్యాగము | 28 |
| శరీరం విలువ | 30 |
| అనుభవ పాఠం నేర్పిన సద్గురు శ్రీబాబు | 32 |
| శ్రీసద్గురు పుణ్యారాధన రజతోత్సవ వేడుకలు | 34 |
| సమర్థ సద్గురునాధుని దివ్య చరిత్ర | 35 |
| శ్రీరాధామాధవ రస సుధ | 37 |
| విష్ణు కథలు | 38 |

# భద్రవాక్యం

– పరాశర ప్రసాద్

యుక్తాహార విహారస్య యుక్త చేష్టస్య కర్మసు
యుక్తస్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖహా

(భ.గీ.6/17)

మనసు చంచలమైనదని దానిని నియంత్రించటం శక్తికి మించిన పని అని అర్జునుడు మన ప్రతినిధిగా శ్రీకృష్ణపరమాత్మకు విన్నవించిన విషయం సాధకులంతా గమనించ దగినదే.

మనసు నియంత్రించటానికి చేసే ప్రక్రియలో ధ్యానమొక సాధన. ధ్యానానికి కూర్చున్న వ్యక్తి మనసును ప్రభావితం చేసేవాటిలో ఆహారం, వ్యవహారం, నిద్ర, మనం ఆచరించే కర్మలు ప్రధానమైనవని శ్రీకృష్ణ పరమాత్మ అర్జునునకు తెలియజేస్తూ, మితాహారము, మితనిద్ర, సరియైన ప్రవర్తన, ఎలా ప్రభావితం చేస్తాయో తెలియజేశాడు.



మనం స్వీకరించే ఆహారం సాత్వికమైనదిగా ఉండాలి. మితంగా ఉండాలి. మనం సాధనకు సహకరించే వారితోనే సాంగత్యం చేయాలి. విరుద్ధ భావాలు ఉన్నవారితో చెలిమి ప్రమాదకరం కావచ్చు. అతి నిద్ర వలన సోమరితనము, నిద్రలేమి స్థితి నీరసానికి గురికావచ్చు. తమోగుణ ప్రేరణ వలన మనసు నియంత్రించ బడదు. అంతేకాదు రజోగుణ ప్రేరణకు గురియైన సాధకుడి మనసులో తీరని కోరికలు, జరిగి పోయిన సంఘటనలు చోటుచేసుకుని కలతపెడతాయి. ఇక సాధకుడికి శాంతి ఎక్కడిది? అటువంటి సాధకుడి మనసు పలు విషయాదులపై పరిభ్రమిస్తుంది.

మనం ఆచరించే కర్మలు నిస్స్వార్థమైన వినిష్పక్షపాతమైనవి అయి ఉండాలి. మితము తప్పిన సాధన కలిగించు దుఃఖమునకు హేతువు ప్రయత్న లోపమేగాని యోగము ఎంత మాత్రము కాదు అని గుర్తించాలి.

*

# యోగి వేమన

గత సంచిక తరువాయి

- శ్రీ బులుసు వెంకటరమణయ్య

41. శ్లో॥ చెఱకు తీపిలేమిఁ జెత్తనాఁబడునట్లు
పరగ గుణములేని పండితుండు
దూఱుపడునుగాదె దోషమటుండఁగ
విశ్వదాభిరామ! వినురవేమ!



తాత్పర్యము -

చదువుకొన్నందుకు మంచి గుణములు ఉండవలెను. గుణములు లేకుండుట తప్పు. అంతేకాదు దానివలన నిందయును కలుగును. ఎట్లనగా - చెరకులో తీపి లేనిచో అది చెత్త అనియే చెప్పవచ్చు.

42. శ్లో॥ చదివి చదివి కొంత చదువంగ చదువంగ
చదువుచదివి యింకఁజదువు చదివి
చదువుమర్మములను చదువలేఁడయ్యెను
విశ్వదాభిరామ! వినురవేమ!

తాత్పర్యము -

ఎంతకాలము చదివినను, ఎన్నెన్ని చదువులు చదివినను, చదువుల మర్మమగు ఆత్మ తత్త్వమును తెలిసికొనలేనిచో చదువులన్నియు నిరర్థకమగును.

43. శ్లో॥ జననమరణములకు సరిస్వతంత్రుఁడు కాఁడు
మొదటఁగర్తకాఁడు తుదనుకాఁడు
నడుమఁగర్తననుట నగుబాటుకాదొకో
విశ్వదాభిరామ! వినురవేమ!

తాత్పర్యము -

మూర్ఖుడు తానే సర్వమునకు కారణమని భావించి గర్వించుచుండును. పుట్టుకకు గాని, తుదకు మరణమునకు గాని తాను కర్తకాడు. నడుమమాత్రమెట్లగును?



# శ్రీబాబూజీ ఉవాచ

- పరాశర ప్రసాద్

శ్రీ బాబూజీ మహరాజ్ భక్తులకు బోధచేస్తూ "గురుసాన్నిధ్యంలో మాయకు స్థానం లేదు. మాయ ఆచార్యుని ఆజ్ఞకి లోబడిఉంటుంది. గురుమూర్తి అనుగ్రహంలేనిదే మాయని ఎవరూ జయించలేరు. ఇదిమాత్రం ఛాలెంజ్ . సమర్థులైన సద్గురుమూర్తిని ఆశ్రయించిన వారికి మాయదూరంగా ఉంటుంది. గురుదేవులు భక్తులను తమ దృష్టిచేతగానీ, సంకల్పము చేతగానీ, స్పర్శచేతగానీ రక్షించగల్గుతారు. ఆయన శక్తిని ఎవరు అంచనా వేయగలరు? పండితులు దీనిని అంగీకరిస్తారా? మీరు చదివిన శాస్త్రాలు నేను చెప్పిన విషయాన్ని అంగీకరింపచేస్తాయా? అదే శాస్త్రవాసన. అది జన్మజన్మల నుండి సంక్రమించిన వాసన అది సమయం వచ్చినప్పుడు విజృంభించి లొంగదీస్తుంది.



అదే మాయాశక్తి. జీవుడు తాను ఆచరించిన కర్మలద్వారా అనేక జన్మల పరంపరంగా మోసుకువచ్చిన కర్మశేషమే 'వాసన' అని పిలువ బడుతుంది. ఇది మూడు విధములుగా ఉంటుంది. ఒకటి దేహవాసన, రెండు శాస్త్రవాసన, మూడు లోకవాసన. ఈ దేహము నేను, నాది అని భావించే అజ్ఞానమే దేహవాసన. శాస్త్రములు, గ్రంథాలు పఠించడం ద్వారా అహంకారముతో తనంతటి వాడు లేడు. తన భావనే యదార్థము అని వాదించి, తర్కించే స్థితినే శాస్త్రవాసన అంటారు. దీనిని అధిగమించడం చాలా కష్టం. 'ఒక వ్యక్తికి శాస్త్రవాసన ఉన్నట్లుగా గుర్తించడం ఎలాగు?' అని మీరు ప్రశ్నించవచ్చు.

శాస్త్రవాసనగల పండితుడు తాను గ్రంథపఠనము ద్వారా విషయాలనే నమ్మి ఎంతటి మహాత్ములు చెప్పినా తాను నమ్మిన సిద్ధాంతమే యదార్థమని తర్కమునకు దిగుతారు" అని అన్నారు.

శ్రీబాబూజీ మహరాజ్ ఇంకా మాట్లాడుతూ "లోకవాసన ఉన్నవారు కీర్తిప్రతిష్ఠలకు ప్రాకులాడతారు. ఉన్నత పదవులను ఆశిస్తారు. పదిమంది చేత ఆహా! ఓహో! అని మెప్పు పొందుతారు. ఇటువంటి వ్యక్తులు తమ ఆశయ సిద్ధికోసం దేనినైనా త్యాగం చేసేస్తారు.

సత్యగురువుని ఆశ్రయించిన సాధకులకు మాత్రం ఎటువంటి భయములేదు. వారు గురుసాన్నిధ్యంలో ఉన్నా, ఎక్కడ ఉన్నారక్షింపబడగల్గుతారు. తాబేలు తన పిల్లలకి సంకల్పముచేత ఎక్కడ ఉన్నా ఆహారాన్ని అందజేయగల్గుతుంది. అయితే ఇక్కడ ఒక

చిన్న చిక్కు ఉంది. తాబేలు పిల్ల అయితేనే ఆ ఆహారాన్ని అందుకోగల్గుతుంది. అది చేపపిల్ల అయినా, నత్తపిల్ల అయినా అందుకోలేదు. అలాగే ఆచార్యులు అందించే అనుగ్రహము, ప్రేమని అందుకోవాలంటే నువ్వు గురుబిడ్డవి అయివుండాలి. గురుబిడ్డ అంటే ఎవరు? సద్గురుమూర్తిని ఆశ్రయించినంత మాత్రముచేత, బోధాశ్రవణము చేసినంత మాత్రముచేత గురుబిడ్డ అనిపించుకోజాలడు. తాను నమ్మిన సద్గురుమూర్తిని విశ్వాసంతో ఆశ్రయించి, సేవించి, ఆయన అనుగ్రహాన్ని పొంది, ఆయన ప్రసాదించిన లక్ష్యార్థాన్ని శ్రద్ధతో, క్రమశిక్షణతో రెండుపూటలా ధ్యానించాలి. అప్పుడే నీవు గురుబిడ్డవి అనిపించుకుంటావు.

అంతేకాదు గురువాజ్ఞాపాలన చెయ్యాలి. అటువంటి సాధకునికి పునర్జన్మలేదని నిశ్చయంగా చెప్పగలను ఇది మాత్రం యదార్థము. మీ హృదయబాబు ఎన్నడూ అసత్యమాడడు. నీవు గురుబిడ్డవి అనిపించుకోవాలన్నా, గురుబోధాశ్రవణానికి అర్హత పొందాలన్నా, సద్గురు మూర్తిని సేవించే భాగ్యం పొందాలన్నా నీకు తత్పరత, ఆవేదన ఉండాలి కదా! అది ఉన్న ముముక్షువునే అధికారి అంటారు. గురుమూర్తి అందించే ప్రేమ మాతృప్రేమని మరిపిస్తుంది.

తల్లి తన పిల్లవాడిని అన్నం తినిపించడానికి ఎన్నో మాయమాటలు చెప్పి ముద్దలు తినిపిస్తుంది కదా! అలాగే గురుమూర్తి శిష్యులను తన చాతుర్యంతో బోధచేసి సక్రమమార్గములో తీసుకువస్తారు. అంత ఎందుకు? మీరంతా కూర్చుని ధ్యానం చేయమంటే ఎంతసేపు కూర్చోగలరు? మరి ఇన్ని గంటలు కదలకుండా కూర్చుని నేను చేసే బోధని వినగల్గుతున్నారంటే దానికి కారణం? మరి ఈ కాలమంతా ధ్యానమనిపించుకోదా? నిత్యకాలంలో జమ కాదా? కళ్లుమూసుకుని కూర్చుంటేనే ధ్యానం అనిపించుకుంటుందా? కళ్ళు మూసుకుని ఎన్నిగంటలు కూర్చున్నా నీ మనస్సు నిలవనప్పుడు అది ధ్యానమౌతుందా? అందువలన ధ్యానం కన్నా, శ్రద్ధగా శ్రవణంచేసిన గురుబోధ చాలా గొప్పది. అని మీ హృదయ బాబు హెచ్చరిస్తున్నాడు" అన్నారు.

*

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ చిరకాల భక్తులు, గాయకులు, బందరు వాస్తవ్యులు అయిన పరిమి మారుతిరావు గారు 16-7-2013 మంగళవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 63 సంవత్సరాలు. సద్గురు దేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాకు!

వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాము.

# శ్రీ మాతాజీ అభిభాషణ

-జపమాలా ప్రసాద

ఉచ్ఛ్వాస నిశ్వాసల ద్వారా మీ మీ లక్ష్యార్థాలని స్మరించండి. మనసు వైపు దృష్టి సారించి ఏకాగ్రత చేయడం ఒక పద్ధతి. మరొక పద్ధతి ఏమిటంటే, ఒకవేళ మీ మనసు యింతవరకు అనుభవించిన ప్రపంచాన్ని, విషయాదులను తీసుకు వచ్చినా అలజడి చెందవలసిన పనిలేదు. నీవు ఉంటేనే నీచేత ఆ ప్రపంచం గుర్తింపబడుతోంది గానీ, ప్రపంచం దానంతట అది గుర్తింపబడటం లేదు.

నువ్వు కళ్ళు తెరుస్తేనే నువ్వు చూడగలుగుతున్నావు. మనసు వుంటేనే చూచిన దానిని గుర్తించగలుగుతున్నావు. ఈ విధంగా విచారణ చేసుకుంటూ వెళితే, క్రమంగా బయటి ప్రపంచం యొక్క అలజడి, అంతరింద్రియాల అలజడి తగ్గి మనసు శాంతిని పొందుతుంది. ఇది ఒక్క గంట ధ్యానం చేస్తే వచ్చేయదు. క్రమం తప్పకుండా అభ్యాసం చేస్తే మనస్సుకి అట్టి ప్రశాంత స్థితి వచ్చి తీరుతుంది. ఈ విధంగా పై చెప్పిన రెండు పద్ధతులలో మనం నడుచుకోవచ్చు.




చక్కగా ఒళ్ళు తేలిక చేసుకుని మనసుని లోపలికి మరల్చి మనం లోపలికి వెళ్దాం. మనలోపల చూసుకుందాం. ఎవరు ఏ లక్ష్యాన్ని సాధించాలనుకుంటున్నారో, ఆ లక్ష్యాన్ని సాధించడానికి మనస్సుని ప్రేరేపణ చేసి, దాని మీద మనస్సుని లగ్నం చేయాలి. మనస్సుకి (ఆత్మతో) కనెక్షన్ ఇవ్వాలి. మన సాంప్రదాయం ప్రకారం ముందుగా 'ఓం' అనే ప్రణవాన్ని పూరిద్దాం. ఆ ప్రణవాన్ని పూరిస్తూ, దానితో బాటు మన హృదయాంతరాళాలలోకి వెళ్ళిపోతూ మనమీ దేహాన్ని మరచిపోయి, మన లక్ష్యమందు మనసు లగ్నం చేసి, ఆత్మతో కనెక్షన్నిద్దాం. నాసికాగ్రం మీదగాని, భ్రూమధ్య మందుగానీ, హృదయస్థానమందు గాని దృష్టిని ఏకాగ్రత చేసి మనస్సుని అంతర్ముఖం చేయాలి. ఇది మొదటి దశ.

నెమ్మదిగా మనసు ఆ ముద్రలు దాటి లోనికి వెళ్ళిపోయి, ఏకాగ్రత చెందుతుంది. ఒక నిమ్మకాయనిగాని, గుండ్రని బంతిగాని, ఒకే చోట పెట్టగా, పెట్టగా, అక్కడ గుంటపడి, అది నిలబడిపోతుంది. అదే విధంగా మన మనసుని కూడా ఒకే లక్ష్యమందు నిలబెట్టగా, పెట్టగా, అది మనమనుకున్నటువంటి లక్ష్యంమీద నిలిచి, దానిని సాధిస్తుంది. మనం కొండల దగ్గర జలపాతాలు చూస్తూ వుంటాం. ఆ కఠినమైన బండరాళ్ళ మీద జలధారలు పడగా పడగా, నీటి ధారలకి ఆ బండరాళ్ళపైన గొయ్యి పడుతుంది. అలాగే, మనంకూడా ఒక లక్ష్యంమీద మనస్సుని నిలపగా నిలపగా, అది ఆ లక్ష్యం పైనే నిలబడిపోతుంది. కనుక, ఒక్కసారి కూర్చోగానే మనసు నిలబడలేదని

నిరుత్సాహపడవద్దు. తప్పకుండా, మనం సాధించి తీరగలం. మనమే చేయగలం. ఆ శక్తి మనదై వుంది. "మనం చేసి తీరుతాం" అని, మన మీద మనకి నమ్మకం వుండాలి.

ఇక లోనికి వెళదాం. ఓంకారం పూరిద్దాం . మీ దేహాలని తేలిక పరచుకోండి ఓం ... ఓం. .. ఓం. (ఈ విధంగా చెప్పి, శ్రీమాతాజీ వారు ఒక అరగంట సేపు మౌనంగా, అందరిచేతా ధ్యానం చేయించిన పిదప).....ఓం సర్వేజనా సుఖినో భవంతు, ఓం సర్వేషాం స్వస్తిర్భవతు, ఓం సర్వేషాం శాంతిర్భవతు, ఓం సర్వేషాం పూర్ణం భవతు, ఓం ఓం తమసోమా జ్యోతిర్గమయ। ఓం మృత్యోర్మా అమృతంగమయ । ఓం శ్శాంతి శ్శాంతి శాంతిః (అని అందరిచేత ఉచ్ఛరింపచేసి వాటి అర్థం, స్పానిష్‌లోను, ఇంగ్లీషులోను చెప్పించారు.) ఆ తరువాత శ్రీమాతాజీ తిరిగి ఈ విధంగా బోధని కొనసాగించారు.

"ఓంకారమనే ప్రణవాన్ని నాభినుంచి పూరించాలి. ఆ ప్రణవం యొక్క శక్తిని మనం పొందాలి అంటే ధ్యానం, ప్రార్థనల ద్వారానే పొందగలుగుతాం. 'ప్రార్థన' అంటే మనకి బయటకి కనిపిస్తుంది. మనం నమ్మినటువంటి భగవంతుడిని, స్వామిని లేక శక్తిని విశేషంగా అర్థించడమే ప్రార్థన. ఇది కొన్ని మాటలతో ముడిపడి వుంటుంది. కాని, 'ధ్యానం' అనేది మనం అంతరంగంలో అనుభవించే ప్రక్రియ. అది మాటలకి, భాషకి అందేదికాదు. అది కేవలం అనుభవం. ఆ భగవంతుడు నాకిచ్చిన శక్తిమేరకు మీ అందరికీ తెలిసేటట్టుగా చెప్పానని అనుకుంటున్నాను. ఇందులోని సత్యాన్ని గ్రహించండి.

మనందరి లక్ష్యము ఒకటే. మనందరము ఒకేలాగ జీవిస్తున్నాం. ఒకే దాన్ని పొందాలని ప్రయత్నం చేస్తున్నాం. ఒకే దాన్ని పొందాలి కూడా. పద్ధతులు వేరువేరుగా కనిపించవచ్చుగాని, మనందరి లక్ష్యం ఒక్కటే అది సత్యాన్ని గుర్తించడం. ఎక్కడెక్కడికో వెళ్ళి, ఏదో పొందవలసినది, పొందలేనిది ఏమీలేదు. అది మనందరి జీవితాలలోనూ అంతర్భాగమై వుంది. మనలోనే వుంది. చెడుని వదిలిపెట్టి, అందరిలోని మంచినే తీసుకుని అందరికీ మంచినే చేస్తూ, అందరూ సౌభ్రాతృత్వంతో బ్రతకగలిగితే చాలు.

అదే మనం చేసే ప్రార్థన, ధ్యానాలయొక్క సారం. భయంలేని చోటకూడా భయాన్ని కల్పిస్తోంది మన మనస్సు. మనం దేనికీ భయపడాల్సిన పనిలేదు. ఎందుకంటే, మనందరము ఆశ్రయించిన శక్తి మనకి 'నేనుండగా ఎందుకుభయం?' అని చెప్తోంది. ఆ శక్తియందు విశ్వాసం కావాలి. అది దృఢంగా వున్ననాడు మనం దేనికీ భయపడవలసిన పనిలేదు. మనం దేనినైనా సాధించగలం. ఆ విధంగా మనందరిలో నిగూఢంగా ఉన్న సత్యాన్ని మనం గుర్తించడానికిగాను, అఖండ భక్తి, జ్ఞాన వైరాగ్యములని ప్రసాదించి, భగవంతుడు అందరికీ మంచి చేయుగాక!"

# సన్నిధిలో సంభాషణ

– పరాశర ప్రసాద్

30.6.1985

'మానవుడు ధ్యానం ఎందుకు చేయాలి? ధ్యానం చేసేవాడికి ధ్యానం చేయనివాడికి తేడా ఏమిటి?' అని శ్రీబాబుజీ భక్తులను ప్రశ్నించారు.



"భగవంతుని ధ్యానం చేసేవాడూ చేయనివాడూ ఒక మాదిరిగా గోచరించినా వారి ప్రవృత్తులతో తేడా ఉంటుంది. ఉప్పు, కర్పూరము ఒకేరీతిగా ఉన్నా అవి వేరు వేరు రుచులు కలిగి ఉంటాయి. మన వేమనగారు దానిని చక్కగా వివరించారు. పురుషులు, పుణ్యపురుషులు వేరు వేరుగా గుర్తింబడతారు కదా! గాజుముక్క, డైమండ్ ఒకేరీతిగా ఉన్నా గాజు ముక్క పరీక్షకి నిలవదు. డైమండ్‌ని గుర్తించే పరీక్షకుడు ఉంటాడు. వాడు చాలా తేలికగా గాజు ముక్కని ఏరివేస్తాడు.

మానవుడు జన్మజన్మల నుంచి దుష్కృత కర్మలద్వారా, కామక్రోధాది గుణాల ద్వారా ఆర్జించిన రాక్షస ప్రవృత్తిని మార్చుకుని శాంతిని, ఆనందాన్ని పొందవలెనంటే భగవద్ధ్యానము తప్పనిసరిగా చేయవలసిందే. అలాగని ఎక్కడో ఆరణ్యంలోనో, గుహలోనో ముక్కుమూసుకుని సోమరిగా కూర్చుని మనస్సు ఆన్యథా ఉంచటము నిరర్థకము. తన ప్రవృత్తిలో మార్పు రానంతవరకు మనస్సు భగవంతునిపై నిలవక విషయాదులకి ఆకర్షింపబడి చివరికి నేను భగవంతుని ధ్యానిస్తున్నాను. కాని నాకూ భగవంతుని ధ్యానించని వారికీ తేడా ఏమిటి? అని ఎదురు ప్రశ్న వేసుకుని నాకంటే వాడి స్థితే బాగుంది అని అసంతృప్తిచెంది చివరికి భగవంతుడు ఎక్కడ ఉన్నాడు? అని వాదిస్తాడు.

మానవుడు తాను చేసే ధ్యానము కుదరక భగవంతుడిని నిందిస్తే తప్పు ఎవరిది? మనస్సు భగవానుని యందు నిలవాలంటే మనస్సు శుద్ధమై ఉండాలి. హృదయ పవిత్రత కావాలి? మన శాస్త్రాలు, పురాణాలు, గ్రంథాలు అన్నీ మనస్సు యొక్క ప్రవర్తన మారటానికి చక్కని మార్గాన్ని వివరించాయి. మనస్సు ప్రవర్తన మారటానికి గురుకృప ఎంతో అవసరం. గురువుయొక్క అనుగ్రహాన్ని సాధించినవాడు భగవద్ధ్యానములో తాను చేసిన తప్పును తెలుసుకోగలుగుతాడు.

ప్రతి మానవుడు తన స్వధర్మాన్ని ఆచరించాలి. ఎప్పడూ తాను బాగుపడాలని కోరుకోవటం సహజమే కాని ఎదుటివాడు నాశనం అవ్వాలని అనుకోవటం తగదు. మానవుడు తన జీవిత కాలంలో మిలియన్లు బిలియన్లు ధనాన్ని ఆర్జించవచ్చు కాని అది తను కన్ను మూసిన తర్వాత వెంటరాదు. సరికదా పోనీ శాంతినైనా ఇస్తుందా ? దారాపుత్రాదులను పోషించుకోవటం స్వార్థంకాదు! తన వారిని ప్రేమించలేని వాడు ఇతరులని ఏం ప్రేమిస్తాడు?

మానవుడికి కావలిసినది తృప్తి, కాబట్టి మానవుడు భగవద్ధ్యానము ద్వారా సంసార సాగరంలో కెరటాలని అధిగమించి కెరటాలు లేని ప్రశాంతమైన స్థితిని పొందుతాడు. సంసారాన్ని త్యాగము చేయవలసిన అవసరం లేదు. అన్ని యుగాలలోనూ, అన్ని కాలాలలోనూ రాజర్షులు ఉన్నారు. శ్రీ శంకర భగవత్పాదుల వారు కూడా పరకాయ ప్రవేశము చేసి రాజర్షి అయ్యారు.

కాబట్టి సంఘంలో ఉంటూనే నిస్సంగుడుగా ఉండాలి. అందరిలోనూ మంచినే చూడాలి. చెడు అనేది మన మనస్సులో ఉంది కాని ఎక్కడా లేదు. మన బిడ్డలను ఎలా ప్రేమిస్తామో ఎదుటివారి బిడ్డలను కూడ అలాగే ప్రేమించాలి. భగవంతుని ధ్యానం ద్వారా ఇంతకన్నా ఏంసాధించాలి? ఇదే నిజమైన socialism అని పిలువబడుతుంది" అన్నారు శ్రీబాబు.

* * *

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ చిరకాల భక్తులు, విజయవాడ వాస్తవ్యులు, శ్రీమతి ఆలపాటి వెంకట సుబ్బమ్మగారు (జాలయ్యగారి ధర్మపత్ని) 24-6-13 మంగళవారం శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 84 సంవత్సరాలు. సద్గురు దేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక!

వీరి కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు మా ప్రగాఢ సానుభూతి తెలియ జేస్తున్నాము.

# శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు

ఆగస్ట్ 2013
1 గురు శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ.
5 సోమ మాస శివరాత్రి
16 శుక్ర శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీవ్రతం
21 బుధ రాఖీపూర్ణిమ శ్రీసద్గురు పాదపూజ
28 బుధ శ్రీకృష్ణాష్టమి స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా 27-8-13 నుండి 2-9-13 వరకు సప్తాహదీక్షతో శ్రీకృష్ణాష్టమి వేడుకలు జరుగుతాయి. (వివరములు క్రింద యివ్వబడినవి.)
ఆగస్ట్ 30 శుక్ర శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

సెప్టెంబర్ 2013
3 మంగళ మాసశివరాత్రి
5 గురు టీచర్స్‌డే, ఉదయం 10గం. శ్రీసద్గురుపాదపూజ
9 సోమ శ్రీవినాయక చవితి తె.జా 5గం.30ని॥ శ్రీసద్గురుపాదపూజ, ఉదయం 11గం. సామూహిక విఘ్నేశ్వర పూజలు, భక్త సమారాధన.
19 గురు పూర్ణిమ శ్రీసద్గురుపాదపూజ
29 ఆది శ్రీగురుదశమి, సత్సంగసమావేశము, శ్రీసద్గురుపాదపూజ.

**శ్రీసద్గురు ప్రసాదిత (50వ,) స్వర్ణోత్సవ శ్రీరాధాకృష్ణ జన్మాష్టమి మహోత్సవములు**
**శ్రీ సద్గురు భాగవత, అఖండనామ సప్తాహ, త్రయాహ్నిక సాధుధర్మ సమ్మేళన**
**సర్ణోత్సవ కార్యక్రమాలు**

**స్వస్తి శ్రీ చాంద్రమాన శ్రీ విజయనామ సంవత్సర శ్రావణ బహుళ సప్తమి అనగా ది.27-8-2013 మంగళవారం నుండి 2-9-2013 సోమవారం వరకు సప్తాహ దీక్షతో శ్రీకాళీవనాశ్రమము నందు పూజా కార్యక్రమములు జరుపబడును. కావునయావన్మంది భక్తులు కార్యక్రమములో పాల్గొని తరించవలసినదిగా కోరుతున్నాము.**

కార్యక్రమములు

సప్తాహ్నిక శ్రీకృష్ణ మూలమంత్ర హెూమము, త్రయాహ్నిక సాధుధర్మ సమ్మేళనము, అఖండ సప్తాహ్నిక హరేరామ నామము, భాగవత ప్రవచనము, భగవద్గీతా పారాయణ మాతాజీవారిచే దివ్య అనుగ్రహ భాషణ ఉంటాయి.
2-9-2013న పూర్ణాహుతి, శ్రీరాధాకృష్ణుల సహస్రనామపూజ, శ్రీసద్గురుపాదపూజ జరుగుతాయి.

(గత సంచిక తరువాయి)

# యోగవాశిష్ఠము

-సుషుమ్న ప్రసాద

జీవన్ముక్తుడు కోరిక రహితుడు. నేనూ, నాదీ అనే వాటిని జయించి, భయ రహితంగా క్రోధ రహితంగా ఉంటాడు. అతడు సర్వత్రా బ్రహ్మనే దర్శిస్తాడు. అతనికి సమతా దృష్టి సమహిత చిత్తము ఉంటాయి. అతనికి దేని యందు అనుబంధము, మమత ఉండవు. అతని స్థితి అనిర్వచనీయము. కాని అతను యీ ప్రపంచములో సామాన్య మానవునిగా సంచరిస్తూ ప్రశాంతిగా ఒడుదుడుకులు లేకుండా ఉంటాడు. ఎప్పుడూ తుర్యావస్థలోనే ఉంటాడు. అతను తాను సర్వవ్యాపకుడైన పరబ్రహ్మను అని స్వానుభవంగా గ్రహించి, ద్వంద్వాతీతంగా, భేదరహితంగా, జాతి నీతి గోత్ర వర్గ రహితంగా ఉంటాడు.



"ఓ దీనుడవైన రామా! ఒక పసిబిడ్డ మాట్లాడినా అతను చెప్పేది శ్రుతి సమ్మతంగా సద్గురు ఆదేశాలు స్వానుభవం మిళితమై ఉంటే ఆ మాటలను నిస్సందేహంగా నమ్మవచ్చు. అందుకు భిన్నమైన మాటలైతే సాక్షాత్ బ్రహ్మ చెప్పినా గడ్డిపోచలా తృణీకరించవచ్చు.

ఓ రణధీరుడవైన రఘువరా! నీలో ఆత్మజ్ఞానమును పెంపొందించటానికే ద్వందాతీతము, నిత్యానంద స్వరూపుడైన పరబ్రహ్మ స్వభావమును గురించి సవివరంగా చెప్పాను.

జ్ఞానము, పైన వివరించబడిన చతుర్విధ లక్షణములు పరస్పరము, అనుబంధమై ఉంటాయి. జ్ఞానము తటాకము అయితే, చతుర్విధ సాధనలు అందులో పెరిగి, వికసించే పద్మాలవంటివి. ఇది ఒకదానికొకటి పెంపొందుతూ ఆత్మ సాక్షాత్కారమును త్వరితంగా కలిగింపజేస్తాయి.

ఓ సుగుణాభిరామా! నీ సందేహాలను, చీకాకులను, భ్రమలను తొలగించటానికి నేను చెప్పే కథలను శ్రద్ధగా విని, సత్యము, శివము, సుందరమైన పరబ్రహ్మమును పొందాలి. ఈ జ్ఞాన కథలను ఎవరైతే శ్రద్ధగా విని, తదనుకూలంగా, నిజమైన వైరాగ్యంతో తమ జీవితాలను మలచుకుంటారో వారు అవినాశము, అనంతమైన ఆధ్యాత్మిక సంపదను నిత్యానందమును, పరమశాంతిని, ఆధ్యాత్మిక వికాసమును, ముముక్షత్వమును సాధిస్తారు" అని వశిష్ట మహర్షి ప్రబోధించారు.

## ఉత్పత్తి ప్రకరణము

బ్రహ్మము పవిత్రము, ద్వంద్వాతీతము, సర్వవ్యాపకము, పరిపూర్ణము, లోప

రహితము, వర్ణనాతీతము, పరిధులు లేనిది, స్వయం ప్రకాశమైనది, దృశ్యమానము, పరిణామముతో కూడిన ప్రపంచము. అదృశ్యము, పరిణామ రహితమైన బ్రహ్మమునందే ఉత్పన్నమైంది. ఇదంతా బ్రహ్మము యొక్క మాయా ప్రభావము. ఇది కేవలము మాయ యొక్క వైవిధ్యమే. సచ్చిదానంద పరబ్రహ్మమే విశ్వము లాగ గోచరిస్తుంది. మనసు వలనే ప్రపంచము మనకు గోచరిస్తూ, మనసు వలనే ప్రపంచము సత్యమని భ్రమిస్తున్నాము.

ఈ విశ్వం ఒక సుదీర్ఘమైన స్వప్నం. సంకల్ప వికల్పముల వల్లనే మనసు విస్తరిస్తున్నది. మానసిక కల్పనచేత విస్తరించిన యీ విశ్వము మేఘములలోని గంధర్వ నగరమెంత వాస్తవమైనదో, అంత అవాస్తమైనదని వశిష్ఠ మహర్షి శ్రీరామచంద్రునకు ప్రభోదించారు.

జీవాత్మ తనలోని తెలివితో 'నేనెవరని' భావిస్తుంది. అహంకారము మనసు యొక్క సంకల్పము చేత ఉత్పన్నమవుతుంది. రెండు చెక్కల రాపిడి చేత చిన్న అగ్ని ఉత్పన్నమవుతుంది. ఆ చిన్న నిప్పుకణమే పెద్ద మంటగా విస్తరిస్తుంది. జీవునిలోని అహంకారం వైవిధ్యమైన వస్తువుల వివిధానుభావాల వల్ల విస్తరిస్తుంది. సూక్ష్మంగా ఉన్న 'నేను' క్రమేపీ దృఢమవుతుంది. 'నాది' అనే భావము దృఢంగా నాటుకుంటుంది.

అర్ధరాత్రి గాఢాంధకారంలో రోడ్డు ప్రక్క దుంగ ఉన్నదనే జ్ఞానం లేనందున దుంగయే దొంగ అనే భావము భయాన్ని రేకెత్తిస్తుంది. బ్రహ్మము తప్ప తద్భిన్నమైనది ఏమీ లేదనే జ్ఞాన లోపము వలన యీ విశ్వము వాస్తవమనే భావము ఉత్పన్నమైనది. వాస్తవానికి జీవబ్రహ్మలు భిన్నము కాదు. అవిద్య అనే ఉపాధిని తొలగించుకుంటే జీవాత్మ పరమాత్మ ఒక్కటే అని గుర్తిస్తావు. ఘటము విచ్ఛిన్నము కాగానే ఘటాకాశములో లీనమైనట్లు జీవాత్మ పరమాత్మలో ఐక్యమవుతుంది. అదే విధంగా మనసుకు విశ్వానికి భేదము లేదు. ఇలా వివరించి వశిష్ఠ మహర్షి కర్కటి కథను చెప్తారు.

– సశేషం

## అభ్యర్థన

*శ్రీబాబూజీతో, శ్రీమాతాజీతో మీకు కలిగిన అనుభవాలను, ఇతర ఆధ్యాత్మిక రచనలను కూడా వ్రాసి తెలుగు మాస పత్రికకు పంపండి. రచనలు సులభ శైలిలో ఉండాలి. ఎడిటర్‌గారు ఎంపిక చేసిన రచనలను మాత్రమే ప్రచురించటం జరుగుతుంది. మీరు పంపిన రచనలు తిరిగి మీకు పంపబడవు. మీరు మాకు పంపే ముందే ఒక కాపీ మీ దగ్గర ఉంచుకోండి.*

# గురుకృపా హి కేవలమ్

గత సంచిక తరువాయి - సుశీల ప్రసాద

మహాభక్తులు నూనె వెంకటస్వామిగారింటికి కార్తీక పౌర్ణమికి చీరాల వేంచేసి, శ్రీబాబు భక్తులకు సముద్ర స్నానం తరువాత సద్గురుపాదపూజా కార్యక్రమాలలోకి పాల్గొనే భాగ్యం కలిగించేవారు. అలాగ శ్రీబాబు దివ్య సన్నిధిలో ఉన్న శుభ సమయంలో ఒకనాటి ఉదయం తన దర్శన భాగ్యం ప్రసాదించగా అందరం స్వామి దివ్య చరణార విందాలకు ఆనందంగా నమస్కారాలు చేసుకుంటున్నాము.

అప్పుడు గుడివాడ వాస్తవ్యురాలు లేడీడాక్టర్ ఆమె కుమార్తె ప్రేమ అనే పేరుగల పాప కూడా అక్కడ ఉంది. పాపం! ఆ పిల్లకి మతి స్థిమితం లేదు. కాని తను నేర్చుకున్న నృత్య విద్యను చేసి చూపిస్తూ ఉండేది. కనుక ఆ రోజు ప్రేమ శ్రీబాబుకు నమస్కారం చేసుకున్నాక "బాబూ! మీరు తప్పకుండా మా యింటికి రావాలండీ' అంది. శ్రీబాబు "అలాగే నమ్మా!" అన్నారు. "అదేనండీ! మా నాన్నగారి తద్దినానికి రావాలండీ" అంది. శ్రీబాబుతో సహా అందరూ నవ్వుకున్నాము.

"సరే అయితే నేను డాన్స్ చేస్తాను. మీరు పాట పాడండి" అంది. శ్రీబాబు నవ్వుతూ సరిగా ఆసమయంలో తన పాదాలకి నమస్కరిస్తున్న భీమవరం వాస్తవ్యులు తుమ్మలపల్లి మంగరాజుగారు తలపైన వేలుంచి, ఆయన్ను పాడమని అడగమని ప్రేమకు సైగ చేసి చెప్పారు. వెంటనే ఆ పాప మంగరాజుగారు తలెత్తి లేవగానే ఆయనతో "మీరు పాట పాడండి, నేను డాన్స్ చేస్తాను" అంది. ఆయన చాలా ఖంగారుపడి తెల్లమొహం వేయగా బాబుతో సహా అందరం మళ్ళీ నవ్వుల జల్లులు కురిపించాము. శ్రీబాబు కొంటెతనాన్ని గ్రహించిన మంగరాజుగారు కూడా నవ్వేశారు.

శ్రీబాబు అందరినీ సంతోషంలో ముంచితేలుస్తూ ఇక అక్కడే ఉన్న కామేశ్వరమ్మను చూపించి ఆవిడను పాడమన్నారు. ఆవిడ "బ్రోచేవారెవరురా?" అనే త్యాగరాజ స్వామి కీర్తన మధురాతి మధురంగా పాడగా ప్రేమ మురిసిపోతూ చక్కగా భావాన్ని అభినయించి "నా చేయి పట్టి విడువక" అని సాహిత్యంతో స్వరాలు వేయమని శ్రీబాబు ఆదేశించగా, కామేశ్వరమ్మగారు పాడగా పట్టిన చేయి విడువనని పరమాత్మ స్వరూపులు శ్రీబాబుతోటి ఆ సమయం గడిపిన మేమంతా స్వామి లీలలను చూస్తూ ధన్యులమయ్యాము.

సృష్టిలోని ప్రతిజీవి తన అంశమే కనుక వారే స్థితిలో ఉన్నా ఆదరించి, అక్కున చేర్చి తరింపజేసే అనురాగ సుధానిధి పరబ్రహ్మము శ్రీగురునాధులు అనటం నిత్యసత్యం.

*

# లోకనాథంగారి ఏకాదశి

– భోగరాజు భారతి

'కౌసల్యా సుప్రజా రామ పూర్వా సంధ్యా ప్రవర్తతే' అని సుప్రభాతం వినిపిస్తుంటే కళ్ళు తెరిచారు లోకనాథంగారు. ఇనప్పెట్టె మీదున్న ఏడుకొండలవాడు ఎదురుగా దర్శన మిచ్చాడు. దండం పెట్టుకుంటుంటే ఆ ప్రక్కనే ఉన్న అరటికాయలు కనిపించాయి. నిన్న తను షాపు నుంచి వస్తూ కొన్నాడు ఆ రోజు ఆవపెట్టి కూర వండించుకోవాలని. వంటింట్లో ఎలుకల సందడి ఎక్కువగా ఉంటే అవి పడకగదిలో ఇనప్పెట్టె మీదకు చేరాయి. ఇనపెట్టె కాపాలాదారుడు ఏడుకొండలవాడే!

మొహం కడుక్కోవటానికి పెరట్లోకి వెళ్ళేసరికి స్నానానికి కూడా అన్నీ అమర్చింది భార్య సావిత్రి. బావి గిలక మీద చాదవేసేసరికి రెండో గిలక మీద నీళ్ళు తోడుతూ జగన్నాథంగారు కనిపించారు. అప్పుడే ఆయన స్నానం చేసి, రాగిచెంబు పంచపాత్రతో నీళ్ళు తీసుకుని, ఇంట్లోకి వెడుతుంటే, తను వెనుకపడ్డట్లు అనిపించింది. చురుకుగా నాలుగు చాదలు తలపై దిమ్మరించుకుంటూ, 'ఆషాఢమాసే శుక్లపక్షే...' అని వల్లిస్తుండగా, 'ఇవాళ ఏకాదశిరోయ్ లోకనాథం' అని జగన్నాథంగారు హెచ్చరించి అప్పుడే కోసుకున్న పూలన్నీ పళ్ళెంలో ఉంచుకుని లోపలికి వెళ్ళిపోయారు.

లోకనాథంగారు తలమీద నుంచి కారుతున్నదే కాక అసలే నీరుకారిపోయారు. కారణమేమిటంటే అరటికాయ ఆవపెట్టిన కూరకి ఇవాళ ఏకాదశి కనుక స్వస్తి చెబుతున్నందుకు. అంతలోనే ద్వాదశిపారాయణ గుర్తుకు వచ్చి, ధైర్యంగా స్నానం పూర్తి చేసి, "ఏమేవ్! ఇవాళ ఏకాదశి, నేను ఉపోషం కదా! నువ్వూ, నీ కొడుకు మీరిద్దరే కనుక కందిపచ్చడి, పచ్చిపులుసు చేసుకుంటే యీ రోజు వెళ్ళిపోదూ!" అని ఒక కేకవేసి దేవుడి గదిలోకి వెళ్ళిపోయారు. పూజ సామాగ్రి అమర్చి వస్తున్న తల్లితో కొడుకు గోపాలం తండ్రికి వినబడకుండా 'ఒక అరటికాయ వేయించవే' అన్నాడు. ఆవిడ గుండెల మీద చెయ్యి వేసుకుని, 'ఎక్కడి నుంచి వచ్చిందిరా నీకీ ధైర్యం ?' అంటూ నాలుగు అంగల్లో వంటింట్లోకి వెళ్ళిపోయింది. ఏమీ అనలేక గోపాలం 'నాన్న మరీ డిటెక్టివ్ అయిపోయాడు' అని సణుక్కున్నాడు.

పూజ గదిలో కళ్ళు మూసుకుని జపం మొదలు పెట్టిన లోకనాథంగారి చేతిలో జపమాల కంటె ఎక్కువగా ఆయన మనసులో ఆలోచనలు కదులుతున్నాయి. "వీధిలో దోసకాయలవాడు కేకలు వేస్తున్నాడు. కొంటే బాగుండు. రేపు పచ్చడికో, పప్పులోకో పనికివస్తాయి కదా..... హరేరామ హరేరామ....; అబ్బాయి యింకా స్నానం చేసినట్లు లేడు. కొట్టుకి ఎప్పుడు వెడతాడింక? అందరి షాపులు తెరిచిఉంటే మనది ఒకటి మూసి ఉంటుంది. వీడికి చురుకు ఎప్పుడు వస్తుంది చెప్మా?....హరే కృష్ణ హరే కృష్ణ....ఈ పిల్లలందరూ గోళీలు ఆడుకోవటానికి వీధిలో సిద్ధం. ఒకటే గోల. నాలుగు తన్ని తగలేస్తే ..... రామరామ హరే హరే....వీడు కొట్టుకు వెడుతూ తాళాలు మర్చిపోయాడేమో! వెళ్ళటం రావటం ఇదే సరిపోతుంది. ఇహ వ్యాపారం ఎప్పుడు మొదలు పెడతాడు?

........కృష్ణ కృష్ణ హరే హరే .... ఛీ! ఛీ! ఈ జన్మకి విశ్రాంతి ఎప్పుడు? హాయిగా రామ కృష్ణా అంటూ పడిఉండటానికి లేదు...... హరే హరే హరే హరే... (ఇంతలో కొలికి పూస చేతికి తగిలింది) హమ్మయ్య! ఇదిగో కొలికి పూస వచ్చేసింది. ఇవాళ్టికి జపం పూర్తి అయింది! అనుకుంటూ జపము, పూజ ముగించి గదిలోనుంచి బయటకి వచ్చేశారు లోకనాథం గారు.

ఎదురుగా స్టూలు మీద వెండిగ్లాసులో చల్లారిన పాలు, వక్కపొడి ఉంచుతూ 'అబ్బాయి కొట్టుకు వెళ్ళి అరగంట అయింది' అని చెప్పగానే, "పూజ చేసేటప్పుడు నేను అనుకున్నాను కదా! స్వామి చూసుకున్నాడు అందుకే" అనుకుని తృప్తి పడ్డారాయన. పాలు తాగి పేపరు అందుకునే సరికి, 'ఒక డజను చక్రకేళిలు, నాలుగు కమలాలు, రెండు యాపిల్స్, పావుకిలో ద్రాక్ష పళ్ళు తీసుకు వచ్చాను. నాన్నగారికి ఇవ్వు. రెండు డజన్లు బత్తాయిలు కూడా మంచివి దొరికాయి' అంటూ, తండ్రి ఏకాదశి ఉపవాసం సంగతి తెలిసిన తనయుడు, తల్లికి సంచీ అందించి, సైకిల్ మీద తుర్రు మన్నాడు కొడుకు గోపాలం. ఒక విడత బత్తాయి రసం తీసి యిచ్చింది సావిత్రమ్మ భర్తకి.

ఫలహారం పూర్తిచేసిన లోకనాథంగారు పడక కుర్చీలో వెనక్కివాలి భాగవతం చేతిలోకి తీసుకున్నారు. ఏకాదశిరోజు అంబారీషోపాఖ్యానం చదవటం అలవాటేగాని, అదేమి చిత్రమో! నాలుగు పద్యాలు చదివేసరికి కంటిమీదకి నిద్ర వచ్చేసింది అలవాటుగా. ఇంకా చిత్రంగా ఆ నిద్రలో కల వచ్చి, ఆ కలలో అంబరీషుని రక్షించే నిమిత్తం బయలు దేరిన విష్ణు చక్రం తన వెంటపడ్డట్టు, తానే దుర్వాసుడైనట్లు, చక్రం తరుముతుంటే పరుగెత్తి, పరుగెత్తి ఆయాస పడుతూ ఆ ఖంగారులో మెలకువ వచ్చేసిందాయనకి. అప్పటికి ఒళ్ళంతా చెమటలు పట్టి, గుండెదడ వచ్చి లేచి, చెంబుడు మంచినీళ్ళు తాగితే కాని మనసు స్థిమిత పడలేదు. అక్కడితో భాగవత పఠనానికి స్వస్తి!

ఇక మెల్లిగా లేచి కండువా భుజం మీద వేసుకుని బయటకు బయలు దేరుతుంటే, మినప పప్పు రుబ్బుతున్న సావిత్రమ్మగారు, 'దిబ్బరొట్టె కాలుస్తున్నాను. అందులోకి అల్లంపచ్చడి చేయాలా? బెల్లం పానకంచాలా?' అని అడిగేసరికి "అల్లం పచ్చడి లేకపోతే రొట్టెకి రుచే లేదు" అంటూ అడుగు త్వరగా కదిపి వీధిలోకి వచ్చేసరికి పక్కవాకిట్లో చాపలు పరచుకుని కూర్చున్న మిత్ర బృందం చిరునవ్వుతో పలకరిస్తూ "రావోయ్ లోకం! మన జగం భగవద్గీత చదువుతున్నాడు. ఏదో యీ పూటకైనా కనీసం మనసు కాసేపు మాధవుడి మీద పెట్టుకుని మన జన్మ సార్థకం చేసుకుందాం. రా!" అంటూ సాదరంగా ఆహ్వానించారు. విధిలేక వారి మధ్యలో చతికిలపడ్డారు మన లోకనాథంగారు. "రసవర్జం రసోప్యస్య పరం దృష్ట్వా నివర్తతే" అంటున్నారు జగన్నాథం గారు. "ఆ పరమాత్మ దర్శనంతోగాని ఇహలోక వాసనలు నశించవు" అంటూ సులభంగా తాత్పర్యం వివరించి చెబుతుంటే, "ఆహా!" అన్నారంతా.

– సశేషం

# పరిప్రశ్నేన సేవయా - పరాశర ప్రసాద్

వైరాగ్యం అంటే ఏమిటి? స్మశానంలో ఆ క్షణంలో అవధులు దాటిన వేదాంతం పలకవచ్చు. అక్కడ నుంచి నిష్క్రమించిన మరుక్షణం మళ్ళీ మామూలే. అంతేకాదు అపజయాల వల్ల ఏర్పడే వైరాగ్యం శాశ్వతమా? ఎన్నటికి కాదు. ఇక పరిస్థితులు అనుకూలించక వైఫల్యం వలన కలిగే వైరాగ్యం ఎల్లకాలం నిలవదు కదా! నిర్మలమైన నిలకడ కలిగిన మనసు కలవాడికి, ఆశలేని వాడికి వైరాగ్యం భిన్నంగా ఉంటుందా? వైరాగ్యం అంటే జగత్తుని, సృష్టిని అసహ్యించుకోవటం కాదు.



శీతోష్ణ సుఖదుఃఖేషు అన్నట్లుగా సమబుద్ధి కలిగి ఉండటం. రాగద్వేషాలు ఉండకూడదు. సంకల్పం జనిస్తే రాగం ఉన్నట్లే కదా!

అంటే మనసు సంకల్ప రహితం అయినప్పుడే అది పరిపూర్ణ వైరాగ్యానికి నిదర్శనం. నీకు రుచించని కూరగాయలో లేక ఫలాన్నో త్యాగం చేయటం వైరాగ్యం కాదు. నీవు ఎంతగానో ప్రేమించే సిగరెట్టునో, డ్రింకునో, కాఫీనో త్యాగం చేసి, నిత్యమూ దాని గురించి స్మరణ చేయటమూ వైరాగ్యము అనిపించుకోదు. జీడిపప్పు, ద్రాక్ష, పాలు, పంచదారతో తయారుచేసిన పాయసాన్ని స్వీకరించి వమనం చేసుకున్నాం అనుకోరుచికరమైన పాయసాన్ని, వమనం చేసుకున్న పాయసాన్ని సమభావంతో చూసిన మనసుగల సాధకుడు విరాగి.

నిజమైన వైరాగ్యం అంటే వస్తు భావన, పదార్థ భావన తొలగి, నిరపేక్ష భావన కలిగి ఉండటం. భౌతిక బంధము మోహాన్ని పెంపొందిస్తుంది. ప్రేమ త్యాగాన్ని ప్రోత్సహిస్తుంది. త్యాగం వైరాగ్యానికి హేతువు. నిజమైన వైరాగ్యం సాధించటానికి స్వచ్ఛందంగా, యిష్టంగా స్పృహతో యింద్రియ సంయమనం సాధించాలి.

ఇంద్రియాలు తమంతట తాము నిర్వహించే కార్యకలాపాల నుంచి బయట పడాలి. అలా జరగాలంటే మనసు స్వస్థానంలో చేరాలి. స్వస్థానం వదలిన మొసలి ఎలా బలాన్ని కోల్పోతోందో అలాగే మనసు స్వస్థానం వీడి సంచారిణి అవుతోంది. దానిని సాధించటానికి పాండిత్యము, శాస్త్రజ్ఞానము కాదు కావలసింది. సమర్థులైన సద్గురుమూర్తి ఆశ్రయము మార్గదర్శకత్వము. అది లభించిన సాధకుడు వైరాగ్యాన్ని సాధించటం తథ్యం.

*

గత సంచిక తరువాయి

# శ్రీకృష్ణ కర్ణామృతం

– సుశీలా ప్రసాద

చటుక్కున ముందుకు వెళ్ళి రెండు చేతులూ చాచి పిలుస్తున్న ఆ బాలుని తన చేతులతో ఎత్తుకుని గుండెలకద్దుకుని కిందికి దింపాడు. ఆ చిన్నవాని స్పర్శతో శరభయ్యకి ఒళ్ళు తెలియని మైమరపు కలిగి తెలియని ఆనందంలో మునిగిపోయాడు. మరోక్షణానికి తెప్పరిల్లి విశాలమైన ఆ కనుదోయిని, నీలిరంగు ఒంటి ఛాయలో మెరిసే ఆ చిన్నారిని కన్నార్పక చూస్తూ "నువ్వెరు బాబూ?" అన్నాడు. "కిందికి దిగలేని వాడివి ఆ చెట్టుకొమ్మమీద ఎలాగ ఎక్కగలిగావు?" అని కూడా అనాలనుకునే లోపులోనే ఆ బాలుడు "యీ తోట ఎవరిది తాతా?" అన్నాడు. "అంతా ఎండిపోయి, మాడిపోయి నట్లు ఉన్నదేమి?" అని కూడా ప్రశ్నించాడు.



"ఈ తోటంతా నాదే బాబూ! పచ్చగా కళకళ లాడుతూ ఉండే యీ తోట ఎందుకిలా అయిందో నాకూ అర్థం కావటం లేదు. అంతా అయోమయంగా ఉంది" అన్నాడు బాధగా శరభయ్య. "అసలు ఎప్పుడైనా పచ్చగా ఉందా? ఇలా ఎందుకైందో నీకు తెలియదా? చాలా చిత్రంగా ఉందే!" అన్నాడా బాలుడు. "తోట సంగతి తెలియని నువ్వు యిది నాదంటున్నావు. నిజంగా నీదేనా?" అన్నాడు మళ్ళీ కొంటెగా నవ్వుతూ.

శరభయ్య మనసు అసలే గాయపడి ఉంది. ఈ పిల్లవాడు వేసే ప్రశ్నలకి విసుగు కూడా వచ్చింది. "నాదేనన్నాగా! ఎందుకంటే చాలాకాలంగా యీ చెట్లన్నీ మొక్కలుగా ఉన్నప్పటి నుంచి గొప్పులు త్రవ్వి, పాదులు చేసి, నీళ్ళు పోసి ఎంతో ప్రేమగా పెంచుకుంటూ వస్తున్నాను గనుక" అన్నాడు గట్టిగా.

"అయితే, తాతా! ఇది నీ తోటే అన్నావు గనుక కాసిన పళ్ళు, పూసిన పూలు అన్నీ నీవే కోసుకుంటున్నావా? లేక ఎవరికైనా యిస్తున్నావా?" అని అడిగాడు చిన్నోడు. "లేదు, లేదు అవన్నీ చెట్లమీద ఉంటే చూసి ఆనందిస్తున్నాను. అంతే!" అన్నాడు శరభయ్య. "మరయితే, యీ చెట్లన్నీ తమకోసం కాయలు పూలు ఇవ్వటంలేదే! పరుల కోసం అవి తమ జీవితాలను వెచ్చిస్తున్నాయి. తమ జన్మలను సార్థకం చేసుకోవాలి అనుకుంటున్నాయి. నువ్వు తినక మరొకరికి పెట్టకపోయేసరికి, అవి నిష్ఫలంగా నేలరాలి పుడమితల్లి ఒడిలో కన్ను మూస్తున్నాయి. ఇలాగ నువ్వెప్పుడైనా ఆలోచించావా?" అని చిన్నవాడి నోటిలో నుండి వచ్చిన మాటలకు శరభయ్య ఆశ్చర్యంతో నిరుత్తరుడయ్యాడు.

"ప్రేమగా పెంచుకుంటున్నానన్నావే, నిజంగా ఆ ప్రేమ వాటిమీదేనా? కాదే, నిన్ను నువ్వు పెంచుకుంటూ, నీ ఆనందం కోసం వాటిని బలిచేశావు. నీ మనస్సుని

మూసేసిన కరుడు కట్టిన స్వార్థం నిన్ను యీ విధంగా చెడగొట్టేసింది. నువ్వు ఇన్ని రోజులుగా పెంచిన తోట, 'నువ్వు పూలు పూయి! కాయలు కాయి! అంటేనే చేసిందా? కాదే? అలాగైతే ఇప్పుడీ మోడైన తోటని తిరిగి చిగురించు! ఫలించు!అంటే వింటుందా?" పసివాడి పలుకులు ములుకులై శరభయ్య హృదయంలోని అహంకార మమకారములనే తెరలను పొరలను చీల్చివేస్తున్నాయి. శరభయ్య చెక్కిన బొమ్మలా నిల్చుని వింటూ ఉండిపోయాడు. "సరే! నీదనుకున్న తోట తీరు యిలా ఉండగా, యింతగా నమ్ముకున్న యీ దేహంలోని అవయవాలు, చిన్నతనంలో లాగ, యీ ముసలితనంలో నువ్వు చెప్పిన మాట వింటున్నాయా? పరుగెత్తు, బరువులెత్తు అంటే చేస్తున్నాయా? లేదే? మరి జీవన చక్రంలో నడిపించే శక్తి ఒకటి వేరే ఉందని తెలుసుకోతాత!" ఎన్నడూ తాను ఆలోచించని బాలుడు పలికే పలుకులను శరభయ్య మనసు ఒప్పుకుంటున్నది. నమ్ముతున్నది. అలాగని వానిలో మార్పు వస్తున్న సమయంలో ఆ చిన్నారి యింకా మాట్లాడుతూ "ఒకనాడు కొంతమంది చిన్నారులు నీ తోటలోకి వచ్చి పళ్ళు తిని హాయిగా గంతులు వేస్తున్న సమయంలో నువ్వు కాలయముడిలా వచ్చి వాళ్ళమీదపడి వాళ్ళందరినీ తరిమి కొట్టావు. గుర్తుందా? నువ్వు కోపంతో నిప్పులు కురిసే కళ్ళతో వాళ్ళని చూస్తే, వాళ్ళంతా నీ చూపు అందనంత దూరంలోకి వెళ్ళిపోయారు గనుక బ్రతికిపోయారు. ఆ క్రూర దృష్టితో నువ్వు నీ తోట వంక చూసేసరికి ఆ వేడికి నీ తోటంతా మాడిపోయింది. నిలువునా కాలిపోయింది. కనుక ఇది నువ్వు చేసిన అపరాధమే. దోషి నువ్వే. తప్పు నీదే!" అంటుంటే ఆ దృశ్యమంతా కళ్ళముందాడుతూ శరభయ్య కుప్పకూలిపోయాడు. వెక్కివెక్కి పసివాడిలా ఏడ్చాడు. చేతులారా నా తోటని నేనే నాశనం చేసుకున్నాను" అని తప్పు తెలుసుకుని పశ్చాత్తాప పడుతున్న వాని మనసు కరిగినీరైపోయింది.

"ఇన్నాళ్ళుగా మారని నా మనసుని ఇప్పుడు నీవు పూర్తిగా మార్చివేశావు. ఇక నువ్వెవరని నేను నిన్ను అడగను. నన్ను బాగుచేయడానికి వచ్చిన దైవానివి. అసాధ్యాలను సాధ్యాలుగా చేయగల శక్తిగలవాడవని నమ్ముతాను. మనస్ఫూర్తిగా నిన్ను నేను విశ్వసిస్తున్నాను" ఆ బాలుని రెండు చేతులూ పట్టుకుని శరభయ్య"దయచేసి నా తోటని రక్షించు" అని వేడుకున్నాడు. అంతే! తోటలోని ప్రతి తరువూ పులకరించి, పరవశించి జీవంతో కళకళలాడిపోయింది. "నువ్వెవరవో నిజం చెప్పు. సర్వకోటికి జీవనాధారుడువు కదా?" అని ఆనందంతో శరభయ్య వేసిన ప్రశ్నకి, ఆ బాలుడు అమాయకంగా నవ్వుతూ "కాదు, కాదు. నేను నందగోపుని కుమారుణ్ణి. యశోద ముద్దుల తనయుణ్ణి. నాకు వేణువంటే చాల ఇష్టం." తన వేణునాదంతో నూతన రాగాలు పలికించసాగాడు. ఆ వేణుగానం మాయామోహితమాన జగత్తును జ్ఞానమయం చెయ్యగల సునాద వినోదిని!

*

# చరణ కమల మధు ప్యాసీ....

- రమణ ప్రసాద్

(మౌన ధ్యాన శిబిరంలో చేసిన శ్రీమాతాజీవారి ప్రసంగాల నుండి)

మానవుడు సుఖాన్నే కోరతాడు. సుఖం ఎక్కడ ఉన్నదో ఆత్మ విమర్శ చేస్తే తెలుస్తుంది. గురువే ఆత్మ స్వరూపుడు. ఆయన తను సృష్టించిన పంచభూతాలను ఆవహించుకుని స్వరూపం ధరించి మనలను తరింపజేయటానికి వచ్చారు. కాని మనం మానవమాత్రునిగా తలచి ఆయనా మనలాగే ఉన్నాడుగా, ఆయనలో విశేషమేమిటి? అని అపోహపడతాము.

గురువే సర్వ వ్యాపకుడు, సర్వజ్ఞుడు, సర్వాంతర్యామి, సర్వస్వతంత్రుడు అని నమ్మాలి. గురుదేవునికి చేసే నిజమైన పూజ విశేష పూజ. సామాన్యపూజ కాదు. సామాన్య పూజ అంటే షోడశోపచారాలు చేయటం. పూలతో పూజించటం. విశేషపూజ మనం ఎక్కడున్నా చేయవచ్చు. అది మనసుతో చేసే పూజ.

గురుదేవులు మన అర్హతలు చూడలేదు. ఎలా ఉన్నా మనకు అభయమిచ్చి తమ పాదాల చెంత స్థానమిచ్చారు. తరించేందుకు హంస శివస్సోzహం అనే సూచన మంత్రం యిచ్చారు. అది నిరంతరం శ్వాసతో చేర్చి జపించే మంత్రం. గురుదేవులను తెలుసుకోవాలంటే ఆర్తితో, ఆవేదనతో ఆరాధించాలి.

చరణకమల మధు ప్యాసీ<br>
జనమ కరమకే పాప్ కె కారణ శిక్షా మేరీ మంజూర్ హుయిా మరణ్<br>
మానో హర్ ఏక్ క్షణ్ అంతిమ క్షణ్ మనసా వాచా కరూఁ తేరె<br>
చరణ్ స్మరణ్ భవహరణ్ తరణ్ తేరె

ప్రభూ! నేను చరణ కమలాల నుండి వచ్చే మధువును గ్రోలటానికి తృష్ణ కలిగి ఉన్నాను. నేను చేసిన పూర్వ జన్మల కర్మల ఫలితంగా యీ మానవజన్మ వచ్చింది. జన్మ ఎత్తినందుకు మరణమనే శిక్ష పడింది. దీని నుండి తప్పించుకునేందుకు ఒకటే మార్గం. అది ప్రతి క్షణమూ అంతిమ క్షణంగా భావించి నిన్ను స్మరించటం. అలా స్మరిస్తే నువ్వు భవబంధాలు నుండి తప్పించి తరింపజేస్తాడు. అయితే నీ స్మరణ త్రికరణ శుద్ధిగా ఉండాలి. మనసా వాచా కర్మణా భగవన్నామ స్మరణ చేయాలి.

గురుదేవులు "ఉపాసకానాం కార్యార్థం బ్రహ్మణా రూపకల్పనా" అనే ఉపనిషత్ వాక్యం ప్రకారం మనకోసం అవతరించి వచ్చారు. ఆయన్ని గుర్తించాలంటే జ్ఞాన చక్షువు కావాలి.

సూరదాస్ శ్యామసుందరుని అంతర్చక్షువు ద్వారా దర్శించాడు. బాలకృష్ణుని రూపంలో వచ్చి శ్యామసుందరుడు సూరదాస్‌కు పరిచర్యలు చేశాడు. అంతెందుకు? శివాజీ మహరాజ్ తమ గురువైన సమర్థ రామదాసుకు సర్వసమర్పణ చేసుకుని, తన రాజ్యాన్ని ఆయన పాదాల ముందు ఉంచలేదా? సమర్థులు "శివబా! నీ త్యాగ నిరతి కొనియాడదగినదే, కాని నువ్వు క్షాత్ర ధర్మాన్ని నిర్వర్తించాలి. నేను నిన్ను ఆజ్ఞాపిస్తున్నాను ఈ రాజ్యాన్ని నువ్వు పాలించు" అని ఆదేశించాడు. కాని శివాజీ తిరిగి ఆ సింహాసనం మీద కూర్చోలేదు. గురుదేవుల పాదుకలనుంచి గురుదేవుల ప్రతినిధిగా రాజ్యాన్ని పాలించాడు. ఆ గురుదేవుని తెలుసుకోవాలంటే –

మధుప బనూఁ మై మధుర మూరతి ప్రభు,
ఝూమ్ కే గావూఁ ప్రణవ మధుర స్వర
కామ క్రోధ యితి షడ్ పద్ మేరే కాట్ జలాదో
సాథ్ రహూఁ తేరే

"నేను ఒక మధుపమనై ఝుంకార నాదముతో ప్రణవాన్ని జపిస్తూ ఉంటే ఏ విధంగా భ్రమరం కీటకాన్ని మధ్యలో పొడుస్తూ ఉంటే భయంతో ప్రణవనాదం చేస్తూ తను భ్రమరంగా మారుతుందో అలా నాలో ఉన్న కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలనే ఆరు గుణాలను తీసివేసి నన్ను ఒక భ్రమరంగా మార్చు ప్రభూ!" అని ప్రార్థిస్తున్నాడు భక్తుడు.ఆశాపాశం వలన పతనం చెందే కోతివలె ఆశామోహాలలో చిక్కుకున్న మానవుడు తన గమ్యాన్ని చేరలేకపోతున్నాడు.

బృందావన సుందర మధువన్ మే మృదుల మధుర తేరే చరణ్‌మే అంకిత
ఘాస్‌కి టుకడె ధూళికె కణ సబ్ ధన్య ధన్య హై ఉన్‌సె మిలూఁ మై।

మనం బృందావనంలోనే ఉన్నాము. ఆయన పాదాల చెంత ఉన్నాము. ఆయన నామంలో రమిస్తున్నాము. ఆ గురుతత్త్వం ఎటువంటిది?

యస్యాంర్నాదిమధ్యం.......

ఎవరికైతే ఆది మధ్యాంతరాలు లేవో, ఎవరికైతే చరణాలు లేవో, నామగోత్రాలు లేవో, ఎవరైతే పురుషుడు, స్త్రీ, నపుంసకుడు కానివాడో, ఎవనికైతే ఆకార వికారాలు లేవో, జనన మరణాలు లేవో, ఎవరికైతే పుణ్యపాపాలు లేవో, తత్త్వం లేదో కాని తత్త్వపూరితమో అదే తత్త్వమసి అనే గుర్తింపునిచ్చే తత్త్వం. అట్టి సహజ సమరస స్వరూపుడైన రసోవైసః అని చెబుతోంది తైత్తరీయ ఉపనిషత్. సద్గురుదేవునికి నమస్కరిస్తున్నాను" అంటున్నాడు సచ్ఛిష్యుడు. అట్టి గురుదేవులు మనలను సర్వదా కాపాడుగాక!!

# సర్వము నీ దయ

– సుశీలా ప్రసాద

తెలవారుతుంటే శయనాగారంలో హంసతూలికాతల్పం మీద సుఖనిద్రలో ఉన్న శ్రీ వర్ధన చక్రవర్తిని మేలుకొలుపుతూ వైతాళికులు మధురంగా గానం చేస్తుంటే, లీలగా చెవులకు సోకి మెలమెల్లగా కనురెప్పలు విప్పి మేలుకున్నాడు. రాత్రంతా తను కలలు గన్న సుందర దృశ్యాలను తలచి, అవి శుభ స్వప్నాలే కావటం వలన చక్రవర్తి పెదవులపైన సన్నని చిరునవ్వు మెరసింది.

“ఆహా! నేనెంత అదృష్టవంతుణ్ణి! నిజంగా నా జీవిత చరిత్ర అపూర్వమైనది. ఆశా బలం మూలంగా, స్వశక్తితో చుట్టు ప్రక్కల ఉన్న చిన్న చిన్న రాజ్యాలన్నీ జయించి, నా తండ్రి నాకిచ్చిన రాజ్యాన్ని మహాసామ్రాజ్యంగా పెంచాను కదా! మా వంశ మూల పురుషుడు స్థాపించిన రాజ్య విస్తీర్ణం యీ నాటి నా రాజ సభా కూటానికి సరిపడేటంత మాత్రమే...” ఇలా ఆలోచిస్తూ పడక మీద నుంచి లేచిన చక్రవర్తిని చూచి, ఒక పరిచారిక త్వర త్వరగా వచ్చి పాదపీఠం అమర్చి నమస్కరించి నిలిచింది. శ్రీవర్ధనుని నేత్రాలు గర్వంతో తళుక్కుమన్నాయి.

“ప్రతి వ్యక్తి నా ముందు మోకరించ వలసినదే. ఈ అపార సంపదలకు, సువిశాల సామ్రాజ్యానికి, సకల సౌఖ్యాలకు అధపతినైన నాకు సాటి ఎవరున్నారు? కాని మృత్యువు ఒక్కడే నాకు పరమశత్రువుగా కనిపిస్తున్నాడు. సామాన్య మానవులకంటె అతీతుడనైన నేను యింకా ఉన్నత స్థితికి ఎదిగి మృత్యువును అధిగమించే శక్తిని ఎందుకు పొందకూడదు? శాశ్వతమైన జీవితం లభించినప్పుడే కదా నాకీ అనంత ఐశ్వర్యాలను సాధించిన ఫలితం దక్కేది!”

శ్రీవర్ధనుడి భావాలిలా విహంగ మార్గంలో విహరిస్తుంటే, కాలకృత్యాలు తీర్చుకున్నాడు. అప్పుడు గుర్తొచ్చింది నేడు తాను వేటకెళ్ళాలన్న విషయం. వెంటనే రాజాజ్ఞపై ప్రముఖులైన వేటగాళ్ళూ, ప్రసిద్ధులైన యోధులూ, అంగరక్షకులూ తదితరులంతా వేటకు తగిన సన్నాహాలు చేసి సిద్ధం కాగా వేటకుతగిన దుస్తులు ధరించి చక్రవర్తి తన పంచకళ్యాణి గుఱ్ఱానెక్కి, నగర పరిసరారణ్యాలకు సాగిపోయాడు.

చక్రవర్తి ఎక్కిన గుఱ్ఱం ఇతరుల అశ్వాలను కనురెప్పపాటులో దాటి ముందుకు దూసుకుపోతుంటే అడవిలో అక్కడక్కడ కనబడిన జంతువులను వేటాడుతూ వారంతా సూర్యుడు నడిమింట చేరిన వేళకి నట్టడవిలోకి చేరుకున్నారు. అప్పటికి వేటవలన, ఎండవేడికి అలసిపోవటంతో వేట ముగించి నగరానికి తిరిగి పోవడానికి నిర్ణయించి. పరివారానికి తెలియజేసాడు రాజు. ధనుర్బాణాలను సేవకుని చేతికిస్తున్న చక్రవర్తికి అంతలో చిత్రవిచిత్ర వర్ణాలతో నవరత్నాల పోగులాగ మెరిసే మేనిఛాయగల ఒక లేడి

కనిపించి, అంతలో పొదలమాటున అదృశ్యమైంది.

వెంటనే మహారాజుకు తన పట్టపురాణి గుర్తుకువచ్చింది. తన సిరిసంపదలకు తోడు అనుకూలవతి, అనన్య సౌందర్యవతి అయిన ఆమె తన భార్యకావటం గొప్ప భాగ్యంగా తలచే చక్రవర్తి అతిశయం మరొకమెట్టు పైకెక్కింది. ఇప్పుడీ లేడిపిల్లను పట్టి తీసుకునిపోయి ఆమెకు కానుకగా యివ్వాలనిపించింది రాజుకు. వెంటనే లేడిపిల్ల దూకిన దిశగా గుర్రాన్ని పరుగెత్తించాడు. రాజపరివారమంతా వాని రాకకోసం ఎదురు చూస్తూ ఉండిపోయారు.

శ్రీవర్ధనుడు ఎంత దూరం పోయినా ఆ లేడిజాడ అగుపడలేదు. ఆ సరికే తన అనుచరులను వదలి చాలా దూరం పరుగెత్తుకు వచ్చేశాడు. ఇంతకాలం నిరంతరంగా ప్రయాణం చేసినందు వలన గుర్రం నురగలు కక్కసాగింది. చక్రవర్తికి కూడా వేటవలన ఒళ్ళంతా అలసిపోయి ఉంది. ఆపైన ఎండకి దేహమంతా వేడెక్కి ఉడికిపోసాగింది. ఆ అడవిలో ఒక కొసకు వచ్చేసినట్లు గుర్తించిన చక్రవర్తి గుర్రం దిగి చుట్టూ కలయచూశాడు. దగ్గరలోనే ఒక సరస్సు కనిపించింది. మెల్లమెల్లగా గుర్రాన్ని నడిపించుకుంటూ ఆ కొలను దగ్గరకి వెళ్ళాడు. దాని చుట్టూ పెరిగిన మహావృక్షాలు చల్లని నీడనిస్తున్నాయి. చక్రవర్తి ఆ నీడను, సరస్సులోని చల్లని నీటిని చూస్తూ సర్వమూ మరచి వేటదుస్తులను తీసివేసి, దగ్గరే ఉన్న చెట్టుకొమ్మలకి తగిలించి నీటిలోకి దూకాడు. గుఱ్ఱం కూడా కొద్దిగా నీరుతాగి గట్టున ఉన్న పచ్చని పచిక మేస్తూ తిరగసాగింది.

శ్రీవర్ధనుడు ఆ చల్లనినీటిలో ఉండగా ఎంతకాలం గడిచిందో తెలియలేదు. కొంతసేపటికి తృప్తిపడిన చక్రవర్తి ఒడ్డుకు చేరుకుని తన దుస్తుల కోసం చెట్టు కొమ్మలవైపు చూశాడు. వాటిని ఎక్కడ తగిలించాడో ఆ కొమ్మలమీద అవి కనబడలేదు. మరొకసారి కళ్ళు తుడుచుకుని రాజు ఆ చుట్టుప్రక్కల కొమ్మలన్నీ కలయచూశాడు. చిత్రం! అవి ఎక్కడా లేవు! అప్పుడే రాజుకు తన గుర్రం గుర్తుకు వచ్చింది. పరిసర ప్రాంతాలలో ఎక్కడా దాని జాడకూడ లేదు. తన దుస్తులూ, గుర్రమూ యీ విధంగా మాయం కావటం రాజుకు పరమ ఆశ్చర్యంగా తోచింది. ఎవరైనా దొంగలు యీ దారిన పోతూ వాటిని తస్కరించారా? లేక విరోధుల పన్నాగమా?

శ్రీవర్ధనుకి స్నానంతో చల్లబడిన శరీరం, కోపంతో వెడెక్కసాగింది. అపరాధుల్ని శిక్షించటం విషయం తరువాత ఆలోచించి వచ్చును గాని, తీరాన నగ్నంగా నిలబడటం ఎంతసేపు? అనుకుంటూ రాజు తన పరివారాన్ని గొంతెత్తి బిగ్గరగా పిలవసాగాడు. ఒక పిలుపుకే వందమంది పలికే చక్రవర్తి జీవితంలో తొలిసారిగా ఆయన పిలుపులన్నీ వ్యర్థమైపోయిన అనుభవం సంప్రాప్తమైంది. ఈ విపరీత సంఘటనలకి అతడు చాలా ఆశ్చర్యపోయాడు!

– సశేషం

# ఈశ్వర లీల

R.TC.లక్ష్మి

సాధరాణంగా నృత్యం లేదా గాన సభలలో ఆయా కళాకారుల మధ్య అనగా నృత్య లేదా గాయకుడు మిగిలిని వాద్యకారులు ఏదో అవగాహనతో పరస్పరం వివిధ రకాలైన హావభావాలతో విన్యాసం చేస్తుంటారు. వాటిలో ఏ మాత్రం ప్రవేశం లేకపోయినా దూరంగా ఉండి ఆనందించే శ్రోతలు, మరియు వీక్షకులు కూడా ఏదో రకమైన ఆనందానుభూతికి లోనౌతూనే ఉంటారు.

నిత్యమూ ఆ కైలాసంలో ప్రదోష సమయంలో జగదంబ, ప్రమథగణాలు, యితర భక్తులూ అందరూ తిలకించి పులకించే విధంగా ఆ శివుడు సదాశివుడై, పరమ శివుడై నర్తిస్తుంటే, బ్రహ్మదేవుడు తాళం వేస్తుంటే, శ్రీహరి స్వయంగా మద్దెల వాయిస్తుంటే.... ఆది శంకరులు, శివానందలహరిలో "స్వామీ! ప్రదోష కాలమను వర్షాకాలంబున, శ్రీహరి వాయించు మద్దెల చప్పుడు ఉరుముగను, అంతరిక్షమున నిలబడి చూచు దేవతల చూపులు మెరుపులుగను, భక్తుల ఆనంద బాష్పధార ధారా వృష్టిగను ప్రకాశిస్తుండగా తాము (అనగా పార్వతీ పరమేశ్వరులు) క్రీడాసక్తులైన మయూరీ మయూరములుగ మిమ్మల్ని భావించి ఆశ్రయిస్తున్నాను" అని ఆనందించారు.



అప్పుడు ఆ ఆనంద తాండవ సమయంలో శివునికి తాండవానికి అనుగుణంగా వాద్యాలు వాయిస్తున్నారా? లేక ఆ వాద్యాలకు అనుగుణంగా శివుడు నర్తిస్తున్నాడా? ఎవరు చెప్పగలరు? శివస్య హృదయం విష్ణుః విష్ణోశ్చ హృదయగ్ం శివః

లయ అంటే తనలో లీనం చేసుకోవటమనే కాక సంగీత ప్రధానంగా కూడా లయ అనే మాట వాడబడుతుంది. శబ్ద ప్రధానంగా మన శరీరంలో మన ప్రమేయం లేకుండా జరుపబడే క్రియలన్నీ చాలా వరకు లయబద్ధంగానే ఉంటాయి. హృదయ స్పందన, నాడీ స్పందన, రక్త ప్రసారవేగం యివన్నీ లయబద్ధంగా జరుగుతున్న క్రియలే. శ్వాస ప్రక్రియ, రెప్పపాటు కూడా అంతే. ఇవన్నీ మన ప్రమేయం లేకుండా ఈశ్వరేచ్ఛ ప్రకారం జరుగుతున్నవే.

వీటన్నిటికి కార్యం కనిపిస్తున్నప్పటికీ కారణం మాత్రం ఈశ్వరేచ్ఛ. ఆయా అవయవాలు ఆయా శక్తులతో ఆయా క్రియలు లయబద్ధంగా జరుపడమనేది ఆ పరమేశ్వరుని లీల!

*

# చందాదారులకు విజ్ఞప్తి

చందాదారులు కొంతమంది 'సమర్థసద్గురు మాసపత్రిక' తమకు చేరటం లేదని మాకు ఫోన్ చేస్తున్నారు. మేము పత్రిక డిశ్పాచ్ చేసేవరకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాము. జిల్లావారీగా సార్టింగ్, కౌంటింగ్ చేసి ఇక్కడ గుంటూరు ఆర్.ఎమ్.ఎస్ వారి దగ్గరకు చేరుస్తున్నాము. మాసపత్రిక చదవాలనే మీ ఆసక్తికి ఆనందము, పుస్తకము చేరటంలేదని విచారము కలుగుతున్నవి. గుంటూరు జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ వారిని సంప్రదిస్తే వారు 'చందాదారులనుండి మాకు కంప్లయింట్ అందితే మేము ఇన్‌స్పెక్టర్‌ను పంపి తప్పక చర్య తీసుకోగలము' అన్నారు. కావున చందాదారులు మాకు అందలేదని ఫోన్‌చేస్తే మేము మరొక పుస్తకము మీకు పంపగలము. కానీ పత్రిక మీకు సక్రమంగా చేరాలంటే మీరు వెంటనే మాకు కంప్లయింట్ ఈ క్రింది విధంగా రాసి పంపగలరు............

సమర్థ సద్గురు తెలుగుమాసపత్రిక యాజమాన్యం వారికి -

నేను .........**AS NO..,..** లేదా **LM NO.** .......... గల చందాదారుడను. ........ నెల పత్రిక మాకు అందలేదు. కారణము తెలియదు. ఇక్కడ మా పోస్ట్‌మాన్ ..........పోస్ట్‌మాస్టర్ ........ పోస్ట్ ఆఫీస్ బ్రాంచ్ .........వారిని సంప్రదించగా మాకు ఈ క్రింది విధంగా సమాధానం చెప్పినారు..... ....... మాకు మిగిలిన ఉత్తరములు సక్రమముగానే అందుచున్నవి. కావున గుంటూరు జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ వారికి ఫిర్యాదు చేయవలసినదిగా కోరుచున్నాము.

నా అడ్రస్ పూర్తి వివరములతో.............

పేరు ........ **AS NO** లేదా **LM NO.**........

ఇంటి నెం........ వీధి పేరు......... గ్రామం పేరు...... జిల్లా......

పిన్ కోడ్ నెం........ ఫోన్ నెం. సెల్...... లాండ్‌లైన్ నెం............

**పాఠకులారా! మీ సభ్యత్వాన్ని గడువుకు ముందే రెన్యూ చేసుకోండి!**

మీ సభ్యత్వం ఏ తేదీ వరకు ఉన్నదో తెలియజేస్తూ సమర్థ సద్గురు పత్రిక కవర్ మీద వ్రాస్తున్నాము. దానిని గమనించి మీరు సకాలంలో మీ మెంబర్‌షిప్‌ను రెన్యూ చేసుకున్న యెడల మీకు నిరాటంకంగా పత్రికను పంపగలము. చందాను ఈ క్రింది ఎడ్రస్‌కు పంపగలరు. బ్యాంక్ డ్రాఫ్ట్ A/C Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ పేరుతో డ్రా చేయండి.

M.O, బ్యాంక్ డ్రాఫ్ట్ పంపవలసిన చిరునామా ...........................

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్, నంబూరు పోస్ట్

శ్రీకాళీగార్డెన్స్ - 522508

గుంటూరు జిల్లా

# బోధల బాబా మహిమ

-రత్నం

మానవశక్తి పరిణామంతో కూడినది. పరిణామ రహితమైనది పరమాత్మ శక్తి. దానిని  తెలుసుకోవాలంటే సద్గురువును ఆశ్రయించాలి. మహాత్ములకు సాధ్యం కానిదేముంది? మొండిగోడను నడిపించగలరు. దున్నపోతుతో వేదం చెప్పించగలరు? మూగవానితో మహోపన్యాసం యిప్పించగలరు. సత్యగురువు మహిమలు చాల ఉంటాయి. అంతేకాని మంత్రజాలము కాదు. గారడీ విద్య కాదు. మహాత్ములు ప్రసాదించేది ముక్తి విద్య.



బోధలబాబా అనే పాండురంగ భక్తుడు నిరంతరం సంకీర్తనానందములో మైమరచి ఉండేవారు. అనేకమంది భక్తులు సుదూరాల నుంచి వచ్చి, అతని సంకీర్తన మాధుర్యం గ్రోలేవారు. ఒకసారి అలా వచ్చే భక్తిసమూహంలో ఒకనికి దోవలో త్రాచుపాము కరిచింది. అతడు చనిపోయాడు. అయినా బాబా సంకీర్తన వినకుండా వెళ్ళటం యిష్టం లేక అతని పరిజనం అతన్ని మోసుకుని బోధలబాబా వద్దకు వెళ్ళారు.

జొన్నచేను మధ్య మంచెపై బోధలబాబా ఆనంద తన్మయత్వంతో మైమరచి నృత్యం చేస్తున్నారు. కాళీయ ఫణాలపై నందకిశోరుని నాట్యం వలె శోభిల్లుతోంది ఆ నృత్యం. నంద కిశోరుని నాట్యం కాళీయుని విషం హరించగలిగింది. ఇక్కడ బోధలబాబా నృత్య సంకీర్తన మాధుర్యం అక్కడ చేరిన భక్తుల హృదయాలలో కరడు గట్టిన విషయ విషాన్నే విరిచేయ గలిగింది.

పాము కాటుకు మరణించిన వ్యక్తిని ఒక చెట్టుకు ఆనించి నిల్చోబెట్టి మిగతా జనమంతా బాబా సంకీర్తనానందంలో పరవశులైపోయారు. ఆ వాతావరణమంతా బృందావనం వలె జనసందోహం యమునా తరంగిణివలె బోధలబాబా శ్రీకృష్ణునివలె భాసించారు. అందరి ముఖాలు ఏదో అలౌకిక తేజస్సుతో వెలిగి పోతున్నాయి. అదే కృష్ణ దివ్య తేజస్సు! ఆ మహాత్ముని దర్శనం ఎంత పుణ్య ప్రదము! ఆయన దివ్య స్పర్శ పాపహరణం కదా!

సాధూనాం దర్శనం పుణ్యం. స్పర్శనం పాపనాశనం. భాషణం కోటి తీర్థానాం. వందనం మోక్షసాధనం అన్నారు. మహాత్ములతో సంభాషిస్తే సర్వతీర్థాలలో స్నానం చేసిన దానికంటె ఎక్కువ ఫలితం కలుగుతుంది.

బోధలబాబా సంకీర్తన మధ్యలో ఒకసారి అందరివంకా చూశారు. చెట్టును ఆనుకుని ఉన్న వ్యక్తి నిద్రపోతున్నట్లున్నాడు. బాబా ఆయన వద్దకు వెళ్ళి "నాయనా!

ఇంత మహదానందంగా సంకీర్తన జరుగుతుంటే నిద్ర ఎలా పొందగలుగుతున్నావు? తమస్సు విడిచిపెట్టు నాయనా! మధురాధిపతి మధుర నామ సంకీర్తనామాధుర్యాన్ని గ్రోలు" అంటూ హరేరామ హరేరామ.... అని షోడశాక్షరీ మంత్రాన్ని సంకీర్తన చేస్తూ అందరినీ చేయమన్నారు. అది మహామహిమ కలది. కలికల్మషనాశని. ఆ మంత్రం జపించినవారికి షోడశగుణాలు హరిస్తాయి.

బ్రహ్మానందంగా సంకీర్తన సాగుతోంది. సంకీర్తన చేస్తూనే బాబా ఆ చనిపోయిన వ్యక్తిని చేతితో తాకారు. కరెంట్‌తీగకు తాకితే బల్బువెలిగినట్లు ఆ వ్యక్తి వెంటనే పునర్జీవుడయ్యాడు. కృష్ణ కరెంట్ తాకగానే కాళీయుని విషమే విరిగిపోతే త్రాచుపాము విషం ఎమి లెక్క? అతని వెంట వచ్చిన వారంతా ఆశ్చర్యపడి జరిగిన విషయం బాబాకు చెప్పారు. బాబా ఎంతో వినయంగా "నాదేముంది బాబూ! నిమిత్త మాత్రుడను. దాసులకు దాసుడను. ప్రభువు నన్ను షర్టుగా ధరించి, తన భక్తుణ్ణి రక్షించుకున్నాడు" అన్నారు. ఎంతటి నిరహంకారము! మహాత్ములంతా అంతే. అంతేకాని నేను మహాత్ముడననిగాని, భక్తుడననిగాని, జ్ఞానిననిగాని, పవిత్రుడననిగాని, వారెన్నడూ చెప్పుకోరు.

నామసంకీర్తన ఎంత గొప్పదో చెబుతూ జితేంద్రియుడన్నాడు "భగవన్నామం బహుత్ మీఠేహై. పీనేవాలే అప్‌నే ఆప్‌కో భూల్ జాతాహై. రామనామ మాధుర్యాన్ని గ్రోలిన కొలదీ తన్నుతాను మరచిపోతాడు. ఆ మాధుర్యం ఎటువంటిదో ఆ జితేంద్రియుడికే తెలియాలి. ఆ తీపి ఎటువంటిదో శబరికే తెలియాలి. ఆ శబరి యిచ్చిన ఎంగిలి పండ్లు పరమానందంగా ఆరగించాడు శ్రీరాముడు. భక్తుల ఎంగిలిలో ఉండే మాధుర్యం మహిమ భగవానునికే తెలియాలి. పామరులకేమి తెలుస్తుంది? దేహాభిమానం, రాగద్వేషాలు ఉన్నవారికి ఎంగిలి అంటే ఎంగిలి, అంటూ అని భేదభావం ఉంటుంది. కాని భక్తులమధ్య ఉండేది అంతా ప్రేమే. అంతా పవిత్రమే.

సంకీర్తన చేయటం వలన ఎన్నో లాభాలు ఉన్నాయి. ప్రపంచపు గోల మనసు లోపలికి ఎక్కకుండా సంకీర్తన కవచంలాగ నిలుస్తుంది. ఆ ప్రపంచపు గోల లోపలికి ఎక్కితే మన లోపల కూడా గోల బయలుదేరుతుంది. నామ సంకీర్తన లోపలికి వెళితే నానత్వం హరిస్తుంది. సర్వవాసనలు, నీచగుణాలు హరిస్తాయిట, హృదయం శుద్ధి అవుతుంది. ఆ హృదయాన్ని భగవానుడు ప్రేమిస్తాడు. భగవానుని పాదుకలు పాదుకలు చాలా మహిమకలవి. <u>పా</u> – పాతకములను హరించేవి. <u>దు</u> –దుఃఖ రహితం చేసేవి. <u>కలు</u> – కలుషాలను హరించి ఆనందంతో కులుకుతూ ఉండమనేవి. ఎవరు దివ్య పాదుకలను హృదయ పీఠంపై అలంకరించుకుంటారో, వారి హృదయం పవిత్ర దేవాలయమై భగవానుని దివ్యమందిరం అవుతుంది.

*

# బాలకృష్ణుని లీలలు

- రమణ ప్రసాద్

చలన చాహత పాయిని గోపాల్ ।
లయె లాయి అంగురీ నందరానీ, సుందర శ్యామ తమాల్ ॥
డగమగాత గిరి పరత పానిపర్,భుజ భ్రాజత నందలాల్ ।
జను సిరపర్ ససి జాని. అథోముఖ్, దుఖత నలిని నమి నాల్ ॥
ధూరి - ధౌత తన్, అంజన నైనని, , చలత లట పటీ చాల్ ।
చరన్ రనిత నూపుర్ ధ్వని, మానో బిహరతబాల్ మరాల్ ॥
లట్ లటక్‌ని సిర్ చారూచఖౌడా సురి శోభా సిసు భాల్ ।
సూరదాస్ ఐసో సుఖ్ నిరఖత, జగ్ జీజై బహు కాల్ ॥

" గోపాలబాలుడు బుడి బుడి నడకలు నేరుస్తున్నాడు. శ్రీ నందరాణి తమాల వృక్షంలా ప్రక్కన ఊతగా ఉండి, తన వ్రేళ్ళని శ్యామ సుందరునికి అందించి నడుస్తోంది. నంద నందనుడు తడబడుతూ క్రింద పడి తన చేతుల నానించి ఉంచి నిలద్రొక్కుకున్నాడు.



అప్పుడు అతని భుజాలు ఎలా ప్రకాశిస్తున్నాయంటే - కమలం తన తల పైన చంద్రుడున్నట్లుగా భావించి ఆ భారంతో అథోముఖంగా వంగినట్లుగా అతని భుజాలు భాసిస్తున్నాయి.

ధూళి దూసరమైన శరీరంతో, యశోదమ్మ కనులకు పెట్టిన కాటుక అతని అందాన్ని ఇనుమడిస్తూ ఉండగా, పడుతూ లేస్తూ వెళ్తూ ఉంటే, అతని కాళ్ళకు కట్టిన నూపుర ధ్వని విహరించే హంసలుచేసే ధ్వనిని పోలి ఉంది.

నుదుట ముంగురులు పడుతూ ఉండగా పారాడుతున్న ఆ బాలుని రూపం అతి మనోహరంగా ఉంది. సూరదాసు మై మరచిపోయి ఇలా అంటున్నాడు -

"ఆహా ! ఈ బాలునిముగ్ధ మోహన రూపం ఈ జగత్తు అంతా ప్రకాశిస్తూ, ఎంతో సుఖదాయకంగా ఉంది. ఈ సుఖంముందు ఇతర లోకాలలోని సుఖాలూ తుచ్ఛమే అనిపిస్తోంది" అని ఆ బాలకృష్ణుడి శోభను వర్ణిస్తున్నాడు సూరదాసు.

*

# సర్వ త్యాగము

– శ్రీవిద్యా ప్రకాశనందాగిరి స్వామి

పూర్వము శిఖిధ్వజుడను రాజు ఉండేవాడు. అతని భార్య చూడాల. పూర్వజన్మ పుణ్య సంస్కారం వలన యిరువురికి చక్కని వైరాగ్యము ఉదయించెను. ప్రతిరోజూ వారు కొంతసేపు ఆధ్యాత్మిక తత్త్వ విచారణ చేస్తుండేవారు. వారిద్దరిలో చూడాల హృదయం అతి నిర్మలముగ, రాగద్వేష రహితముగ, క్రోధాది కషాయ వర్జితంగ ఉండటం చేత మెత్తటి మట్టియందు నాటిన బీజమువలె ఆమెకు శీఘ్రంగా ఆత్మజ్ఞానోదయ మయింది.

భర్తయగు శిఖిధ్వజుని చిత్తం మాత్రం యింకా పరిపక్వత పొందలేదు. శాస్త్రాలలో వైరాగ్యం గురించి, సర్వత్యాగం గురించి వింటున్నప్పుడు అతని హృదయంలో ఆవేశం జనిస్తూ ఉండేది. రాజ్యాధికారాన్ని వదలి అరణ్యాలకు పారిపోవాలనే సంకల్పం వస్తూ ఉండేది. కాని మనసులో మాట భార్యకు మాత్రం చెప్పకుండా లోలోన వాపోతూ ఉండేవాడు.

ఒకరోజు రాత్రి అర్ధరాత్రి వేళ నిద్రలేచి భార్యను, కుటుంబాన్ని, రాజ్యాన్ని పరిత్యాగం చేసి ఎవరికీ తెలియకుండానే పట్టణము వెలుపలకు పోయి అరణ్యాలు గుండ వెళ్ళి, చాలా దూరం వెళ్ళి తన పట్టు వస్త్రాలన్నీ పారవేసి, నారవస్త్రాలు ధరించి, ఒక నిర్జన ప్రదేశంలో ఒక పర్ణకుటీరం నిర్మించుకొని, జపమాల, కమండలం, ఆసనము తీసుకుని కూర్చుని ధ్యానిస్తున్నాడు.

ఆ రాత్రి చూడాల నిద్రలేచి చూసేసరికి పడకపై భర్తలేడు. రాజభవనం, పట్టణం అంతా వెతికింది. సేవకులచే వెతికించింది. కాని కనిపించలేదు. పెక్కు సిద్ధులు సంపాదించి యున్న సాధ్వీమణి కనుక చూడాల వెంటనే ఆకాశ మార్గము గుండా వెళ్ళి నలువైపుల  వెతకగా ఒకానొక నిర్జన ప్రదేశంలో కుటీరం వేసుకుని కాలం గడుపుతున్న భర్త కనిపించాడు. కాని అతని కార్యక్రమానికి అడ్డుతగలటం యిష్టం లేక కొంతకాలం యిలాగే గడపనీ అని తలచి వెనక్కి తిరిగి వచ్చేసింది చూడాల.

రాజ్యకార్యకలాపాలన్నీ స్వయంగా చూడాల చూడసాగింది. కొన్ని సంవత్సరాలు గడిచాక ఒకరోజు చూడాల శిఖిధ్వజుణ్ణి చూడటానికి 'కుంభుడు' అనే బ్రాహ్మణ వేషం వేసుకుని ఆకాశ మార్గం గుండా వెళ్ళి, ఇలా ప్రశ్నించింది....

కుంభుడు (వేషంలో ఉన్న చూడాల) – మీరెవరు? ఇంత నిర్జన ప్రదేశానికి ఎందుకు వచ్చారు?

శిఖిధ్వజుడు – నేను పూర్వము మహారాజును. చూడాల అను పేరుగల చక్కటి భార్య ఉంది. నాకు వైరాగ్యం కలిగి, అన్నిటిని త్యజించి ఇక్కడ ఉంటున్నాను.

కుంభుడు – మీకు మనశ్శాంతి కలుగుతోందా?

శిఖి – అది తప్ప తక్కినవన్నీ కలుగుతున్నాయి.

కుం – మీరు తప్పుదారి అవలంబించారు. కనుకనే మీకు మనశ్శాంతి కలగటం లేదు. శాస్త్రాలు సర్వత్యాగము మోక్షహేతువని చెప్పాయి. కాని మీరు చేసినది సర్వత్యాగము కాదు. రాజ్యము, పరిజనులు, భార్య, కుటుంబము మొదలగు బాహ్యవస్తువులు. వీటిని విడిచిపెట్టారే కాని, మనసులో గల దృశ్య సంకల్పాలు, వాసనలు విడవలేదు. వాటని వదలటమే ముఖ్యమైన సన్న్యాసము. అదే సర్వత్యాగము.

అంతేకాని భార్యా బిడ్డలను వదలి అరణ్యాలకు పరుగెత్తటం కాదు. ఒకవేళ అలా పరుగెత్తి వెళ్ళినా మీ నీడ మీ వెంటే ఉండునట్లు, ఆ దృశ్య వాసనలు, కామాది కషాయాలు మిమ్మల్ని వదలి పోవు. అవి ఉన్నంత వరకూ ఎంత ఏకాంత ప్రదేశంలో ఉన్నా జీవుడికి శాంతి లభించదు. అవి లేనప్పుడు మీరు గృహంలోనే ఉండి రాజ్యాన్ని పాలిస్తున్నా కూడా ప్రశాంతియే మిమ్మల్ని వరిస్తుంది.

నిష్కామ బుద్ధితో, అనాసక్తి పూర్వకముగా కర్మలు చేస్తూ, రాగా చిత్తము శుద్ధపడి, జ్ఞానం ఉదయింపగా కర్మసన్న్యాసము దానంతట అదే సిద్ధిస్తుంది. అంతేకాని మొదటే కర్మలను వదిలి పారిపోకూడదు. ఈ ప్రకారంగా చక్కగా జ్ఞానాన్ని ఉపదేశించి, భార్యయైన చూడాల తన నిజస్వరూపాన్ని భర్తకు చూపింది. అప్పుడు అతనికి జ్ఞానోదయం కలిగి, భార్యతోకూడి తిరిగి రాజ్యానికి పోయి చక్కగా పరిపాలించి అంత్యకాలంలో మోక్షాన్ని పొందాడు.

*

## శ్రద్ధాంజలి

శ్రీ బాబూజీ చిరకాల భక్తులు, ఆశ్రమ స్థిరనివాసులు, శ్రీఆశ్రిత ఆశ్రమ ఆశ్రయులు అయిన, శ్రీమతి పసుపులేటి వెంకట సుబ్బమ్మగారు 14-7-2013 ఆదివారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 97 సం॥లు.

వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాము.

# శరీరం విలువ

– పి. కృష్ణమూర్తి

ఉదయగిరి రాజు ఉదయసేనుడు గొప్ప ధర్మాత్ముడు. అతడు తన రాజ్యంలో అన్ని వృత్తులవారికి సుఖంగా జీవనం సాగేటట్లు అనేక ఏర్పాట్లు చేశాడు. అందరికీ పనులు కల్పించాడు. ఎవరూ కూడా కటిక దారిద్ర్యం అనుభవించనవసరం లేకుండా సాధ్యమైనంత వరకు ఏర్పాట్లు చేశాడు. రాజు యిలా చేయటంతో దేశంలో 'యాచన' అనేది తగ్గిపోయింది. ఏ పనీ చేసుకోలేని వికలాంగులు, ముసలివాళ్ళూ బిచ్చమెత్తి ఎలాగోఅలాగ కాలక్షేపం చేసేవారు.

అ దేశపు బిచ్చగాళ్ళలో ఒక యువకుండే వాడు. వాడు బుద్ధి ఎరిగినప్పటి నుంచి బిచ్చగాడి వృత్తిలోనే బతుకుతూ వస్తున్నాడు. దేశంలో బిచ్చగాళ్ళకు ప్రోత్సాహం క్రమంగా తగ్గిపోతూ ఉన్నందువల్ల వాడికి తన వృత్తి అంతకంతకు కష్టతరం కాసాగింది.

చివరకు ఒకనాడు ఉదయం మొదలు మధ్యాహ్నం దాకా వాడికెవరూ బిచ్చం పెట్టలేదు. ఆకలి దహించుకుపోతూ రాజ వీధిలో ఒక చెట్టు క్రింద కూర్చుని వాడు దారేపోయే వాళ్ళందరినీ యాచించ సాగాడు. ఎవరూ వాడికేసి చూడలేదు. భగవంతుణ్ణి ధ్యానిస్తేనైనా ప్రజలకు దయకలుగుతుందేమోనని, వాడు గొంతెత్తి "ఓ! పరాత్పరా! పేదవాడికింత ముష్టి! ఆపద్రక్షకా! కడుపుకాలే వాడికొక్క కబలం! దయామయా! దౌర్భాగ్యుడికింత ధర్మం!" అని కేకలు పెట్టసాగాడు.

అప్పటికి ఎవరూ వినిపించుకోలేదు. అరచి అరచి అసలే ఆకలిగా ఉన్నవాడికి శోషకూడా రాసాగింది. వాడికి దేవుడిపైన కోపం వచ్చింది.

"ఓరి భగవంతుడా! ఎక్కడ చచ్చావురా? పుట్టించినవాడు పెట్టించడా? అంటారే, పుట్టించినవాడివి పెట్టించవేంరా? నీ అమ్మ కడుపుకాల!" అని వాడి నోటికి వచ్చినట్లు భగవంతుణ్ణి తిట్టసాగాడు.

ఆ సమయంలో రాజుగారు గుర్రం మీద రాజు వీధివెంట వెడుతూ బిచ్చగాడి మాటలు ఆలకించి, వెంటనే గుర్రాన్ని ఆపి, దిగి వాడి వద్దకుపోయి, "ఎవరిని రా అలా తిట్టి పోస్తున్నావు?" అని అడిగాడు.

"ఇంకెవర్ని? పాపాల భైరవుడు భగవంతుణ్ణే !" అన్నాడు బిచ్చగాడు.

"భగవంతుణ్ణి పూజించాలిగాని ఎవరైనా తిడతారా? భగవంతుడు నీకేం ద్రోహం చేశాడు?" అన్నాడు రాజు. "ఇంకేం చేయాలి? పొద్దున లేచినప్పటి నుంచి కూడులేదు. ఎంతసేపు ముష్టి ఎత్తినా ఒక్క కాసైనా దొరక్కపోయే!" అన్నాడు బిచ్చగాడు.

"ఒరేయ్! నీకు డబ్బు కావాలంటే నేనిస్తాను. నేను ఈ దేశానికి రాజును. నీ చెయ్యి ఒకటి యిచ్చెయి. వెయ్యి రూపాయలిస్తాను. లేదా కాలు ఒకటి యివ్వు రెండువేలు యిస్తాను. నీ కళ్ళు యిచ్చావంటే అర్థ రాజ్యం యిస్తాను" అన్నాడు రాజు.

"నీ డబ్బు నాకొద్దు. నేనేమీ ఇవ్వను" అన్నాడు బిచ్చగాడు.

"అంటే నువ్వు చాలా భాగ్యవంతుడన్నమాట ! నీకు వెయ్యి రూపాయల కంటె విలువైన చెయ్యి, రెండువేలకన్న విలువైన కాలు, అర్ధరాజ్యం కన్న ఎక్కువైన కళ్ళూ ఉన్నాయన్న మాట! అవి యిచ్చినందుకు దేవుణ్ణి పూజించక తిడతావేమిరా? పశువా? పో! దేవుడు యిచ్చిన విలువైన కాళ్ళూ, చేతులూ ఉపయోగించి పొట్టపోసుకో, బిచ్చమెత్తకు !" అని వాణ్ణి మందలించి రాజు వెళ్ళిపోయాడు.

అది మొదలు వాడు వీధులవెంట బిచ్చమెత్తటం మాని శరీర శ్రమ చేసి, బ్రతకటం నేర్చుకున్నాడు.

*

## జ్ఞాన గంగ

ఒక ఆశ్రమం ఉండేది. గురుశిష్యులంతా తెల్లవారుజామునే లేచి, స్నానసంధ్యాదులు చేసుకుని, తమ విధులు నిర్వర్తించుకునేవారు. ఆ ఆశ్రమానికి ఒకరోజు ఒక గడ్డాలు మీసాలు పెరిగిన అతిథి వచ్చాడు. అందరిలా అతడు తెల్లవారుజామున లేవక పోయేసరికి, గురువుగారు ఆయన్ని లేపమని కొంతమంది శిష్యులను పంపారు.

దానికి ఆ అతిథి కోపించి "నేనెప్పుడూ జ్ఞానగంగలో స్నానం చేస్తూనే ఉంటాను. బాహ్యగంగ అజ్ఞానుల కోసమే కాని మా కోసం కాదు. వెళ్ళండి" అని కేకలు వేశాడు.

మరునాడు ద్వాదశి. వడలు, పాయసం, బొబ్బట్లు బాగా తిన్నాడు అతిథి. పెందలకడనే పడుకున్నాడు. గురువుగారి మాట ప్రకారం ఆయన గది బయట గొళ్ళెం పెట్టారు శిష్యులు. అర్ధరాత్రి అతిథికి దాహం వేసింది. గదిలో నీళ్ళు లేవు. తలుపు కొట్టినా ఎవరూ తియ్యలేదు. తిట్లకు లంకించుకొని అల్లరి చేస్తున్నాడు అతిథి.

"ఏమిటి హడావిడి?" అంటూ వచ్చాడు గురువు.

"ఏమయ్యా! మీకు మంచి మర్యాదలు తెలియదా? అతిథుల పట్ల యిలానేనా ప్రవర్తించటం? దాదాపు రెండు గంటల నుండి గొంతెండి చస్తున్నా" అన్నాడు.

"అయ్యయ్యో! మరచిపోయారా? మీకు జ్ఞానగంగ ఉంది కదా? తెల్లవారు జామున స్నానం చేసినట్లే యిప్పుడూ త్రాగుతారనుకున్నాము. స్నానానికి పనికి వచ్చిన జ్ఞానగంగ, త్రాగటానికి పనికిరాదా?" అన్నారు.

సిగ్గుతో తలవంచుకున్నాడు అతిథి.

# అనుభవ పాఠం నేర్పిన సద్గురువు శ్రీబాబు

- దాసరి దేవళ్ళు

సమర్థ సద్గురు శ్రీబాబు, మరి కొంతమంది భక్తులతో కలసి, ఒకసారి అరసవిల్లి పుణ్యక్షేత్రాన్ని దర్శించే భాగ్యం నాకు కలిగింది. అందరము దేవాలయంలో స్వామి దర్శనం చేసుకున్నాము. తరువాత సత్రానికి తిరిగి వచ్చాము. భక్తులందరికీ భోజనం ఏర్పాట్లు చూసే బాధ్యత నాది కావటం వలన, కూరలు తెచ్చే నిమిత్తం చేతి సంచీ తీసుకుని బజారుకి బయలుదేరాను. అల్లంత దూరంలో కోనేటి ఒడ్డున నిలబడ్డ శ్రీబాబు నన్ను రమ్మనమని చేతితో సైగ చేశారు. త్వర త్వరగా నడుస్తూ శ్రీబాబును చేరుకున్నాను.

"ఎక్కడికి వెడుతున్నావు?" అన్నారు శ్రీబాబు. "కూరల కోసం బజారుకు బాబు" అన్నాను. "అలాగా మంచిది" అంటూనే, ఆయన వంకే చూస్తున్న నన్ను గుండెల మీద చెయ్యి పెట్టి, కోనేటిలోకి తోసేశారు. గభీమని నీళ్ళలోకి పడిపోయాను. అనుకోకుండా హఠాత్తుగా యిలా జరిగేసరికి బిత్తరపోయాను నేను. ఎలాగో నీళ్ళలో నుంచి తడిసిపోయిన దుస్తులతో ఒడ్డుకు వచ్చాను.

బాబు నావైపే చూస్తున్నారు. నేను అప్పటికి బాబుని స్నేహితునిగా, హితునిగా మాత్రమే చూస్తున్నాను. కాని సర్వాంతర్యామిగా, సర్వజ్ఞునిగా తెలుసుకోలేదు. అందుకే బాబు దగ్గరగా వెళ్ళి, "ఇదేమిటండి బాబూ!" అన్నాను. "అబ్బే! ఏం లేదు" అంటూనే టపీ మని మళ్ళీ నీళ్ళలోకి నెట్టేశారు. ఈ సారి వెల్లకితలా పడ్డాను నీళ్ళలో. "అబ్బా! ఇదేమి సరసరసం!" అనిపించింది నాకు. నాకు యీత రాదు. ఎలాగో చచ్చీచెడి లేచి ఒడ్డుకు వచ్చాను. బాబు అలా చేసినందుకు నా మనసులో ఏ మూలో కోపం వచ్చింది. పైకి వచ్చి బాబుని చూస్తూ "బాగానే ఉంది" అన్నాను.

"ఆహా! అలాగా" అంటూనే బాబు మూడోసారి ముచ్చటగా నన్ను నీళ్ళలోకి బలంగా పడేసారు. ఈసారి యింక నీళ్ళలో పడటంతోనే అడుక్కు పోయాను. ఈత రాదు కదా! నీళ్ళు మింగేసి ఉక్కిరిబిక్కిరి అవుతున్నాను. ఒక పక్క బురద బాగా ఊబి లాగా ఉంది. అందులోకి జారిపోయేలా ఉంది నా పరిస్థితి. ఆ పరిస్థితిలో నేను యింక విడవకుండా "బాబూ! బాబూ! రక్షించండి" అని ప్రార్థన చేశాను. ఇకనేం! శరణాగత రక్షకుడనే బిరుదు కలిగిన బాబు తన గ్లాస్కో పంచె విప్పి నీళ్ళలోకి విసిరారు. నీటి గట్టుకి, ఎంతో దూరానికి నీళ్ళలోకి వెళ్ళిపోయిన నాకు అది అందింది. వెంటనే ఆ పంచె పట్టుకుని బ్రతుకు జీవుడా! అనుకుంటూ, శ్రీబాబు దగ్గరకి ఆయాస పడుతూ వెళ్ళి అడిగాను "ఎందుకు బాబూ! ఇలా చేశారు? నన్ను చంపేద్దామనే?" అని.

శ్రీబాబు వెంటనే నవ్వుతూ "అయ్యయ్యో! నిన్ను నీళ్ళలోకి తోసి చంపేస్తే, మీ అన్నయ్యలు అందరూ కఱ్ఱలు పుచ్చుకుని నా మీదకు వచ్చేసెయ్యరూ! అదికాదు కాని నీళ్ళలో మునిగిపోతున్నప్పుడు నువ్వు ఏమనుకున్నావో నాకు చెప్పు" అన్నారు."మిమ్మల్నే ప్రార్థించాను బాబూ రక్షించమని. మీ స్మరణే చేశాను" అన్నాను.

"అదిగో! అదే కావలసినది. అంత్యకాలంలో నీ మనసు పరమాత్మపై నిలుపుతావా? లేక ధనధాన్యాలకి, దారాపుత్రాదులకి మనసులో స్థానమిస్తావా? అది తెలుసుకోవాలని యిలా చేశాను అంతే. అంత్యకాలంలో మనసు భగవంతునిపై నిలిపిన జీవునికి ముక్తి కలుగుతుంది. భవసాగరం నుండి విముక్తి పొంది, పునర్జన్మలేని పరమ పదాన్ని పొందుతాడు. ఈ సంగతి గుర్తుంచుకో" అన్నారు శ్రీబాబు.

ఇలా శ్రీబాబు అనుభవ పూర్వకమైన పాఠాన్ని నేర్పి ధన్యుణ్ణి చేశారు!

*

భక్త మహాశయులారా!

మిమ్మల్ని ఎంతో అలరిస్తున్న "సమర్థ సద్గురు" తెలుగు మాసపత్రిక, "SAMARDHA SADGURU" ఇంగ్లీషు త్రైమాసిక పత్రికల సభ్యత్వాన్ని పెంచేందుకు మాకు సహకరించండి. రెండు విధాలుగా మీరు సభ్యత్వాన్ని పెంచవచ్చు:

1) గిఫ్ట్ స్కీమ్ - వివాహాది శుభకార్యాలలో, జన్మదిన సందర్భాలలో, తదితర సందర్భాలలో మీ కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు ఈ పత్రికను బహుమతిగా ఇవ్వండి. ఒక సంవత్సరం పాటు తెలుగు మాస పత్రిక పంపుతాము. దీనికి మీరు కట్టవలసిన సొమ్ము 50 రూపాయిలు మాత్రమే.ఇదే విధంగా 50 రూపాయిలు కడితే ఇంగ్లీషు "SAMARDHA SADGURU" త్రైమాసిక పత్రిక 3 సంవత్సరముల పాటు పంపబడుతుంది. ముఖ్యంగా తెలుగు రాని ఆస్తిక మహాశయులకు ఇంగ్లీషు పత్రిక గిఫ్ట్‌గా పంపవచ్చును.

2) తెలుగు మాసపత్రికలను ఒక సంవత్సరం పాటు , ఇంగ్లీషు త్రైమాసిక పత్రికలను మూడు సంవత్సరమాలపాటు మీ జిల్లాలోని లైబ్రరీలకు, భక్త సంఘాలకు, తదితర సంస్థలకు పంపటానికి తగిన సొమ్ము కడితే, ఈ పత్రికలు ఎంతో మంది ఆస్తిక మహాశయులు చదవటానికి ఉపయోగపడుతుంది. దీనికి పైన సూచించిన ప్రకారం డబ్బు కట్టి స్పాన్సర్ (Sponsor)చేయవచ్చును.

ఈ విధంగా మాసపత్రికల సభ్యత్వం పెంచేందుకు దాతలను ముందుకు రమ్మని ఆహ్వానిస్తున్నాము.

## శ్రీసద్గురు పుణ్యారాధన రజతోత్సవ వేడుకలు
## అందరూ ఆహ్వానితులే!

శ్రీసర్వాధిష్ఠాన చైతన్య విశ్వమత ప్రవక్త సమర్థ సద్గురు శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీవర ప్రసాద బాబూజీ మహరాజ్‌వారి రజతోత్సవ పుణ్యారాధనములు కాళీవనాశ్రమ పీఠాధిపతి పూజ్య యోగిని శ్రీ చంద్ర కాళీప్రసాద మాతాజీ వారి ఆధ్వర్యంలో శ్రీకాళీవనాశ్రమం (శ్రీకాళీగార్డెన్స్), నంబూరులో ది. 20-11-2013 బుధవారం నుండి ది. 1-12-2013 ఆదివారం వరకు పంచయజ్ఞ విధులతో జరుపబడును. నిత్యమూ శ్రీగురుగీతా ప్రచనము, శ్రీసద్గురు శతసహస్ర నామార్చనలు, మహామంగళ హారతులు ఉంటాయి.

విశేష కార్యక్రమాలు -

నవంబర్ 20 నుండి బ్రహ్మశ్రీ కొండూరి రామబ్రహ్మంగారి ఆధ్వర్యంలో హెూమము జరుగును.

నవంబర్ 24, 25, 26 తేదీలలో సాధుధర్మ సమ్మేళనము.

నవంబర్ 27న యతీశ్వర పూజలు.

ఈ ఉత్సవాలలో అఖండ హరినామ సంకీర్తన, సామూహిక సద్గురుపాద పూజలు, నౌకావిహారము, ఊంజల సేవ, నగరోత్సవములు ఉంటాయి.

ఈ కార్య క్రమాలలో ప్రతి భక్త హృదయము పాల్గొనాలని మా ఆకాంక్ష. ఈ కార్యక్రమాలలో పాల్గొనుటకు వీలుగా శలవు పెట్టుకునేందుకు ముందుగా తెలియచేయుచున్నాము.

వివరములకు -

ట్రస్ట్ కార్యాలయము - 0863 2293564

కుమారస్వామి రాజా - 93465 35357

మురళీమోహనవర్మ - 93983 34345

ఎ. కుమారస్వామి - 93945 35357

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

– విజయేశ్వరానంద ప్రసాద్

## శ్రీశేషగిరిరావుగారితో శ్రీబాబు

గురు ఔర్ గోవింద్ దోవూం ఖడే। కాకే లాగూ పాయ్।

బలిహారీ గురు ఆప్‌నే। గోవింద్ దియో బతాయ్॥ (కబీర్‌దాస్)

"గురుదేవుడు, భగవంతుడు యిద్దరూ నీ ఎదుట నిలిచినప్పుడు నీవు ఎవరిని కోరుకుంటావు? – భగవంతుడిని చూపించిన వాడు గురుదేవుడే కనుక గురుదేవులనే నేను శరణు పొందుతాను".



ఇది గురుదేవుని సర్వోత్కృష్టతను తెలుపుతూ కబీర్‌దాసు చెప్పిన మాట.

తాము ఎంత శ్రద్ధాభక్తులతో శ్రీకాళీమాతను పూజించినా తమకు దర్శనమీయని ఆ తల్లి దర్శనాన్ని, ఆ తల్లి రూపంలోనే తమ దర్శనాన్నీ కూడా అనుగ్రహించిన తమ గురుదేవులనే జగన్మాత కన్నా మిన్నగా భావించి సేవించుకుని తరించిన మహాభాగ్యశాలి శ్రీశేషగిరి రావుగారు.

డా॥ లంకా శేషగిరిరావుగారు గుండుగొలనులో సుప్రసిద్ధ ఆయుర్వేద వైద్యులు. ఆయుర్వేద ఔషధాలు తయారుచేయటంలోను, రోగ నిదానం చేసి, తగిన ఔషధాలనిచ్చి రోగ నివారణ చేయటంలోను ఆరితేరినవారు. ఏ మాత్రమూ ప్రతిఫలాపేక్ష లేకుండా, రోగార్తులకు సేవాభావంతో వైద్యం చేసేవారు. వారు తీవ్రమైన రాజరాజేశ్వరీ ఉపాసకులు. నిరంతరము శ్రీకాళీమాత, వీరహనుమాన్‌ల మూర్తులతో కూడిన తమ దేవతార్చన పీఠం వద్ద గంటల తరబడి కూర్చుని, అనన్య శ్రద్ధా నిష్ఠలతో పూజా ధ్యానాదులు చేసుకునే వారు. జగన్మాత దర్శనం కోసం నిద్రాహారాలు కూడా మాని పరితపించే వారు. ఎడతెగని కుంకుమపూజ చేస్తూ, పూజాపీఠం దగ్గరనే తమ పక్కన ఒక కత్తి ఉంచుకుని సాధన చేసేవారు. అమ్మ దర్శనం లభించకపోతే ఆ కత్తితో తమ శిరస్సును ఖండించుకోవాలనే సంకల్పం వారిది.

అప్పటికే శ్రీబాబు గుండుగొలను రావటం మొదలైంది. శ్రీబాబు దివ్యత్వాన్ని గూర్చి శేషగిరిరావుగారి మిత్రులు వారికి చెప్పి, శ్రీబాబును దర్శించుకుంటే జగన్మాత దర్శనం తప్పక లభిస్తుందని ప్రోత్సహించారు. కాని శేషగిరిరావుగారికి మొదట్లో నమ్మకం కుదరలేదు. 'కొమ్ములు తిరిగిన దేవీ ఉపాసకులను చూశాను. కాని అమ్మ దర్శనం పొందినవారెవరూ కనబడలేదు. ఇక యీ పసివానికా?' అనుకున్నారాయన. శేషగిరిరావుగారు శ్రీబాబుకన్న చాల పెద్ద వయస్సు కలవారిలా కనిపించేవారు.

ఒక రోజున తమ పూజాపీఠం వద్ద కూర్చున్న శేషగిరిరావు గారు జగన్మాత దర్శనం కోసం చాలా ఆవేదన పడ్డారు. 'అమ్మా! అమ్మా!' అంటూ బిగ్గరగా కేకలు వేశారు.

నేలపై పొర్లుతూ దుఃఖించారు. చివరకు విరక్తులై 'అమ్మా! నీ దర్శనం పొందటానికి యోగ్యతలేని నా జీవితం వ్యర్థం' అంటూ తమ శిరస్సును ఖండించు కోవటానికి కత్తి పైకెత్తారు. అంతలోనే ఆ చేతిని ఒక బలమైన హస్తం గట్టిగా పట్టుకుంది.

శేషగిరిరావుగారు వెనక్కి తిరిగి చూసేసరికి, శ్రీబాబు తన హస్తం పట్టుకుని మందహాసం చేస్తూ నిలబడ్డారు. అప్రయత్నంగానే శేషగిరిరావుగారు శ్రీబాబుకు తల వంచి నమస్కరించారు. శ్రీబాబు "శేషగిరిరావుగారూ! ఎందుకింత ఘోరానికి పూనుకున్నారు?" అని అడిగారు.

"ఏం చెయ్యను? ఎంత కాలం ఎన్ని విధాలుగా పూజించినా, ప్రార్థించినా, ధ్యానించినా అమ్మకు నా మీద దయ కలుగలేదు. ఆ తల్లి దర్శన భాగ్యం పొందలేని యీ వ్యర్థ జీవితం ఎందుకు?" అన్నారు శేషగిరిరావుగారు.

శ్రీబాబు "అక్కడే మీరు పొరబడుతున్నారు. దయలేని అమ్మను మీరు ఊహించ గలరా? మనం అమ్మను చూడాలని ఎంత ఆవేదన పడతామో, అంతకంటె ఎక్కువగా కరుణామయి అయిన జగజ్జనని, తన కోసం ఆక్రోశిస్తున్న తన బిడ్డను చూడాలని ఆరాట పడుతుంది. మీరీ ఘోరానికి ప్రయత్నించటం, అమ్మ ప్రేమను శంకించటమే అవుతుంది. సరిగా అప్పుడే దయామయి అయిన అమ్మ తమ అనుగ్రహ దర్శనం మీకు ప్రసాదించాలని వచ్చింది. కాని ఆమెను గమనించక, మీరు తొందర పడ్డారు. అయినా అమ్మే మిమ్మల్ని రక్షించుకుంది" అన్నారు.

"అమ్మ నాకు దర్శనం యివ్వటానికి వచ్చిందా? నేను గమనించలేదా? మీరు గమనించారా? అయితే నాకు చూపించండి" అని అంటూ శేషగిరిరావుగారు శ్రీబాబు వంక తీవ్రంగా చూశారు. అంతే! కళ్ళు మిరుమిట్లు గొలిపేటట్లుగా, శ్రీబాబు నిల్చున్న చోట శ్రీబాబు స్థానంలో జగన్మాత చిరునవ్వులు చిందిస్తూ దర్శనమిచ్చింది. శేషగిరి రావుగారు ఒక్క క్షణం తమ కనులను తాము నమ్మలేకపోయారు. వారు వెంటనే తమ పూజా పీఠంవైపు చూశారు. అక్కడ జగన్మాత ఉన్న స్థలంలో శ్రీబాబు మందహాసం చిందిస్తూ కనిపించారు. మళ్ళీ యిటు తిరిగితే జగన్మాత; అటు తిరిగితే శ్రీబాబు!

తమకు దర్శనమివటానికి వచ్చిన జగన్మాత ఎవరో, తమను రక్షించుకున్న జగన్మాత ఎవరో గ్రహించిన శేషగిరిరావుగారు కత్తిని పారవేసి, "అమ్మా! అమ్మా! జగజ్జననీ" అంటూ శ్రీబాబు పాదాలపై సాష్టాంగపడి, ఆ పాదాలను చుట్టేసుకున్నారు. ఆనంద బాష్పాలతో ఆ దివ్య చరణారవిందాలను అభిషేకించుకున్నారు.

శ్రీబాబు వారిని లేవదీసి దగ్గరకు తీసుకున్నారు. శేషగిరిరావుగారు చేతులు జోడించి, "బాబూ! నీవు బాలుడవు కావు. బాలుని రూపంలో నన్ను అనుగ్రహించ వచ్చిన బాలా త్రిపురసుందరిమాతవు. ఈ శేషగిరి మీ పాదదాసుడు" అన్నారు.

శ్రీబాబు ప్రేమగా శేషగిరిరావుగారిని తమ కౌగిలిలోకి తీసుకుని, "శేషగిరీ! దాసుడు, యజమాని అంటూ యిద్దరు లేరయ్యా! ఈ రెండు రూపాలలోను ప్రకాశించేది జగన్మాత దివ్య రూపమేనయ్యా!" అన్నారు.

-సశేషం

# శ్రీ రాధామాధవ రససుధ

- శ్రీ హనుమాన్ ప్రసాద్ పోద్దార్

నా ధన జనజీవనమంతా నీవే, తను మనములు నీవే, నీవే సర్వధర్మమూ,
నీవే నా సకల సుఖసదనం, నీవే నా వానివి, నీ వే నా ప్రాణమర్మమూ

నా ఆవశ్యకత నీవే, దానికి ఏకైక పరిపూర్తి కూడా నీవే!
నీవే సర్వకాలమూ అన్ని విధాలుగా ఉపాస్య సుందర విశుద్ధమూర్తివి.
నా సకల క్రియలు నీవే, నా ఉనికిపట్టు నీవే, నా లక్ష్యం నీవు మాత్రమే.
నా మనో మందిరంలో నీవు ఎనిమిది యామాలు ప్రతిష్ఠుడవై ఉంటావు భగవాన్!
నీ నిత్య స్పర్శ సుఖదానంతో నా సర్వ ఇంద్రియాలనూ విశుద్ధతమము చేస్తున్నావు.
బాహ్యాభ్యాంతరాలలో నీవు నిరంతరంగా నా గానాన్ని ప్రవహింపజేస్తున్నావు.



నీవు నా దృష్టిని ఎప్పుడూ తప్పిపోవు. నా నుంచి ఎన్నడూ విడిపడవు.
నాతో కలసి లీనమై ఉండి నిర్మల రసాస్వాద సిద్ధిని చేస్తున్నావు, చేయిస్తున్నావు.
దీనిలో నీ ప్రయోజనానికి భిన్నమైనదేదీ నాకు లేదు.
నా సంకల్పాలన్నీ భగ్నమయినాయి - 'నేను', 'నాది' అనే భావవృక్షం సమూలం ఛిన్నమైనది.
భోక్త భోగ్యమైనదీ అంతా నీవే - నీవే భోగ స్వరూపుడవు.
నా మనోరూపాన్ని ధరించి, సంయోగ వియోగాలన్నింటినీ అనుభవించేది నీవే!

నీ
రాధ



## విఠ్ఠ  కథలు

-రమణ ప్రసాద్

# జనాబాయి

పరమ పుణ్యమైన కార్తీక శుద్ధ ఏకాదశి నాడు ఐదు సంవత్సరాల బాలిక అయిన జనాబాయిని వెంటపెట్టుకొని ఆమె తల్లి తండ్రులు పాండురంగని దర్శించటానికి పండరీపురం వెళ్ళారు. చంద్రభాగా నదిలో స్నానం చేసి విఠలనాధుని దర్శనానికి వెళ్ళారు. జానాబాయి ప్రప్రథమంగా విఠలనాధుని దర్శించింది. ఆ ప్రథమ దర్శనముతోనే తన జీవితాన్ని పాండురంగని పాదాలకు అంకితం చేసింది. దర్శనం అయ్యాక తల్లిదండ్రులు బయలుదేరుతూ జానాబాయిని రమ్మని పిలిచారు. "దయామయుడైన పాండురంగడి సేవలో నా జీవితాన్ని చరితార్థం చేసుకొంటాను స్వామిని వదలి నేను ఇంటికి రాలేను" అన్నది.



"అమ్మా! జనా! అలా అనకు తల్లీ. కనిపెంచి పెద్ద చేస్తున్న మమ్మల్ని వదలి ఆలయంలో ఉంటానంటావేమిటి? నీ మీద మేము ఎన్ని ఆశలు పెట్టుకొని జీవిస్తున్నామో, నీకు తెలియదు. నిన్ను వదలి మేము జీవించలేము. రా తల్లీ! ఇంటికి పోదాము" అని ప్రేమగా పిలిచింది జానాబాయి తల్లి.

తల్లి మాటలకు చిరునవ్వు ఒలకబోస్తూ "మిమ్మల్ని వదలి ఈ ఆలయంలో ఉండటం సబబుకాదంటున్నారు. మీరు నన్ను శాశ్వతంగా మీ వద్ద ఉంచుకుంటారా! పెళ్ళిచేసి అత్తవారింటికి పంపుతారు కదా! అప్పుడైనా నాఎడబాటు మీకు తప్పదు. ఈ ప్రపంచంలో వ్యక్తులపై మనం పెంచుకొనే ప్రేమానురాగాలు ఎంతోకాలం ఉండవు. నా హృదయం పాండురంగడి పాదాలకు అంకితమైనది. ఆ స్వామిసేవలో నా జీవితాన్ని ధన్యం చేసుకుంటాను. నేను మాత్రం పండరీపురం వదలను. నన్ను క్షమించి మీరు వెళ్ళండి" అని చెప్పింది జానాబాయి. చేసేదిలేక ఆ బాలికను ఆలయంలోనే వదలి బరువెక్కిన హృదయాలతో వెళ్ళిపోయారు ఆమె తల్లిదండ్రులు.

జానాబాయి ఆలయంలోకి వెళ్ళింది. కోటి సూర్యుల సమ ప్రభలతో వెలుగుతున్న పాండురంగడిని తదేకంగా చుసింది. "భగవాన్! నీకొరకు అందరినీ

వదలుకొని ఒంటరిగా వచ్చేశాను. ఆమె నోటి నుండి అప్రయత్నంగా ఈ గానం వెలువడింది.

యేరే యేరే మార్ఝ్యా రామా
మన మోహన మేఘశ్యామ
అహూ నంతా మలా భేటీ
దేయి దేయి కృపా గోష్టి
ఆముచీ చుకనీ జన్మవ్యాధీ
ఆమ్హాదేయివో సమాధి
జానీమ్హాణే చక్రపాణీ
కరీ ఐసే హూ కరోనీ

"హే దయామయా! నువ్వు నాహృదయమంతా నిండి పోయావు. నా జన్మ ధన్యమైనది. నాకు సాధుసంతుల సాంగత్యాన్ని కల్పించు. వారి ఆధ్యాత్మిక అనుభవాలను విని తరించేటట్లు అనుగ్రహించు. సంసార బంధాలనుండి విముక్తి చేసి నాకు సద్గతిని ప్రసాదించు. హే చక్రపాణీ సదా నీ దర్శన భాగ్యాన్ని నాకు కలిగించి నన్ను రక్షించు" అని గానం చేసింది.

అదే సమయానికి భక్తాగ్రేసరుడైన నామదేవుడు ఆలయానికి వచ్చాడు. ఆమె గానం విని ఆమె భక్తి ప్రపత్తులకు నామదేవుడు ఆశ్చర్యపోయాడు. "ఎవరమ్మా నీవు?" అని అడిగాడు. "నా పేరు జానాబాయి. పాండురంగడు నా తండ్రి, రుక్మాబాయి నా తల్లి. మీరు నాకు గురుదేవులు. నన్ను అనుగ్రహించి నాకు సరైన మార్గాన్ని చూపండి" అని నామదేవుని పాదాలపై పడింది.

నామదేవులు జనాను తనతో తీసికొని వెళ్ళి తన తల్లి గుణాబాయికి అప్పగించాడు.

ఒక రాత్రి పెద్దగాలి వాన వచ్చింది. నామదేవుడి ఇంట్లో అందరూ నిదురిస్తూ ఉన్నారు. ఆ గాలివానకు ఇంటిపై ఉన్న పూరి కప్పు ఎగిరిపోయే తరుణంలో పాండురంగడు తన చక్రాన్ని ఇంటిపై గొడుగులాగా నిలిపి ఇంటికప్పును మరమత్తు చేస్తుంటే అప్పుడే బయటకు వచ్చిన జనాబాయి ఈ అపూర్వ దృశ్యాన్ని తిలకించి ఆనంద భరితురాలు అయ్యింది. నామదేవులపై పాండురంగడు చూపిన ప్రేమకు ఆమె ఆశ్చర్యపోయింది. ఇంటి కప్పు సరిచేసి పాండురంగడు క్రిందికి దిగుతాడు. జనాబాయి స్వామి పాదాలపై పడింది.

"హే భక్తవత్సలా! నీ అపార కరుణ ఏమని కొనియాడగలను? నామదేవులవారి ఇంటికప్పును బాగుచెయ్యటానికి నువ్వు స్వయంగా వచ్చావా?

నీ భక్తుల పై నీకు ఎంతదయ ఉన్నదో గ్రహించాను. నామదేవులవారిని నాకు గురువుగా నీవే ప్రసాదించావు. వారి పరిచర్య భాగ్యంతో ఈనాడు మీ దర్శనభాగ్యం నాకు కలిగింది." అని నమస్కరించింది జనాబాయి.

పాండురంగడు "జనా! నామదేవుడు నాకు అత్యంతప్రియుడు. బాల్యంనుండి నన్ను భక్తితో సేవిస్తున్నాడు. సదా భగవన్నామం చేస్తాడు. నామానికి దూరమైతే నీటి నుండి వేరుచేసిన చేపలాగా అల్లాడిపోతాడు. నన్ను చూడనిదే ఉండలేడు. నాకు నైవేద్యం పెట్టకుండా తను ఏమీ తినడు. నాకోసం అహోరాత్రులు తపించే నామదేవునికి కష్టం వస్తే నేను ఎలా తొలగించకుండా ఉంటాను? అందుకే నామదేవునికి నిద్రా భంగం కాకుండా నేనే వచ్చి ఇంటి కప్పును సరిచేశాను" అన్నాడు పాండురంగడు.

పాండురంగడి నోటి నుండి వచ్చిన అమృత వాక్కులను విన్న జనాబాయి శరీరం పులకరించింది. గద్గదస్వరంతో "హే భక్తవత్సలా! పాండురంగ విఠలా! నీ కృపను వర్ణింప ఎవరికి తరముకాదు. నీకు సేవ చేసే భక్తులు ధన్యులు. హే కృపాసాగరా! ఈ దీనురాలిని రక్షించు. ఒక్క క్షణమైనా నేను నామస్మరణకు దూరం కాకుండా ఉండేటట్లు ఆశీర్వదించు. నీ దాసిగా ఈ జీవితం సాగిపోయేలా అనుగ్రహించు. నామదేవులవారికి పరిచర్య చేసుకొనే భాగ్యం సదా ఉండేటట్లు చెయ్యి అని ప్రార్థించింది.

నామదేవులవారు మేల్కొన్నారు. దేదీప్యమానంగా శోభిస్తున్న పాండురంగడిని దర్శించి స్వామికి సాష్టాంగనమస్కారం చేశారు.

నామదేవా! నాకు చాలా ఆకలిగా ఉంది. జనాబాయి చేతి వంట తినాలని వచ్చాను. భోజనం తయారు చేయమని అన్నాడు. భక్తులను అనుగ్రహించటానికై వచ్చిన ఆ స్వామికి ఆకలిదప్పుల ఎక్కడివి? నామదేవులవారు "స్వామీ! త్వరలో భోజనం సిద్ధం చేస్తాను. మీరు విశ్రాంతి తీసుకోండి అని స్వామికి పాదసేవ చేయసాగాడు.

– సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL